POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
మార్చి 2022
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 39 సంచిక: 11





# దివ్యజనని అలివేలు మంగమ్మ చరణ సేవక సన్నిధి
# వసతి భవన సముదాయము

పూజ్య గురుపత్ని అలివేలుమంగమ్మ తల్లి సమాధి మందిరం,

'మాతృదేవి దివ్య సన్నిధి'

(సర్వే నెంబర్ 337, గుమ్మళంపాడు, సంత నూతలపాడు మండలం, ప్రకాశం జిల్లా)

పూజ్యశ్రీ అమ్మగారి సాధనా క్షేత్రములో సేవార్థము, దర్శనార్థము వచ్చు గురు బంధువుల వసతి మరియు నిత్యాన్నదాన భోజనశాల కొరకు నిర్మాణము చేయ సంకల్పించిన **'దివ్యజనని అలివేలుమంగమ్మ చరణ సేవక సన్నిధి'** భవన సముదాయమునకు పూజ్య గురుపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు ఫిబ్రవరి నెల 5 తేది, శనివారం మధ్యాహ్నము 12:00 గం.లకు శంకుస్థాపన చేసి, భవన నిర్మాణ కార్యక్రమములకు శ్రీకారం చుట్టినారు.

శ్రీ సాయి మంగ భరద్వాజ సేవాసంస్థాన్ ట్రస్ట్ చే నిర్వహించబడుచున్న ఈ వసతి భవన నిర్మాణ సత్కార్యక్రమములో పాలుపంచుకొనదలచినవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

7893601789 (శ్రీనివాస్ గారు) || 9848577599 (మోహన్ గారు)
9440018038 (రమేష్ గారు) || 9491562498 (సులోచన గారు)
9063334964 (టి.వి. రావు గారు)

*- శ్రీ సాయి మంగభరద్వాజ సేవాసంస్థాన్ ట్రస్ట్*

# సాయిబాబా సాంప్రదాయం వైదికమేనా?!

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

శ్రీ సాయిబాబా కేవలం బాహ్యదృష్టికి వేషభాషలలో ముస్లింలా కనిపించేవారు. అందువలన ఆయనను మొదట భక్తులు వేపచెట్టు క్రింద కూర్చుని వున్నప్పుడు చూచి ఆయనను తీసుకువెళ్ళి ఆ గ్రామంలోని శిథిలమైన మశీదులో కూర్చోబెట్టారు. ఆయన యిక అదే భగవంతుని ఆదేశమని తలచి అక్కడే వుండిపోయారు. ఈ కారణాలుగా తాము సనాతనుల మనుకొనేవారు కొందరు సాయి సాంప్రదాయం మన సనాతన ధర్మానికి విరుద్ధమని భ్రమపడుతుంటారు. లోతుగా చూస్తేగానీ సనాతన ధర్మమే ఆయనలో మూర్తీభవించిందని తెలియదు. మొదట నిజమైన సనాతన ధర్మానికి 'హిందు-ముస్లిం' అనే భేదముండదనీ, అట్టి భేదదృష్టి మత మౌఢ్యమేగాని సనాతన ధర్మం కాజాలదనీ మనం గుర్తించాలి. ఏ మతానికీ విరుద్ధము కాని నిజమైన సనాతన ధర్మము ఆయనలో మూర్తీభవించినదని యీ క్రింద అంశాలు నిరూపిస్తున్నాయి.

మానవుడు యజ్ఞమయమైన జీవితం మాత్రమే గడపాలని వేదాలు చెప్పాయి. వాటిప్రకారం ప్రతివారూ ఐదు యజ్ఞాలు చేయాలి – బ్రహ్మయజ్ఞము, పితృయజ్ఞము, దేవయజ్ఞము, భూత యజ్ఞము, మనుష్య యజ్ఞము. సాయిబాబా ఒక్కరోజైనా ఏమారకుండా యివన్నీ ఎలా ఆచరించారో చూద్దాం.

### బ్రహ్మ యజ్ఞము :

వేదోక్తమైన బ్రహ్మయజ్ఞం రెండు విధాలు. ఒకటి ప్రవృత్తి మార్గానికి చెందినది. రెండవది నివృత్తి మార్గానికి చెందినది. బ్రహ్మచర్యాశ్రమంలో గురువువద్ద నేర్చిన వేదాలు గృహస్థ జీవితం పొడుగునా నిత్యమూ అధ్యయనం చేయడమే ప్రవృత్తి మార్గానికి చెందిన బ్రహ్మయజ్ఞం. అర్థచింతనతో గూడిన వేదగానంతో బుద్ధిని వికసింపచేసుకొనడం ఉత్తమశ్రేణికి చెందిన అధ్యయనం; అర్థం తెలియకున్నా వేదాలపై శ్రద్ధాభక్తులతో పఠించడం రెండవ స్థాయికి చెందిన అధ్యయనం. ఇలాగాక మూడు వేదాల సారమూ ('త్రయీవిద్య') ఓంకారంలోని అ+ఉ+మకారాలచేత సూచించబడినదని తెలిసి భావయుక్తముగా ప్రణవం జరిపించడం గూడా నివృత్తిపరమైన బ్రహ్మయజ్ఞమే. ప్రణవం బ్రహ్మవాచకమేగదా! ఇందులో గూడ ప్రణవార్థ ధ్యానంలో మనస్సును నిలిపి శబ్దరూపమైన ప్రణవాన్ని గూడ విడిచి యుండడం ఉత్తమశ్రేణికి చెందిన నివృత్తిపరమైన బ్రహ్మయజ్ఞం. శ్రీ సాయి దక్షిణ దేశం నుండి వచ్చిన వేద బ్రాహ్మలు వేదమంత్రం మరచినపుడు అది వారికి గుర్తుచేయడం ద్వారా మొదట చెప్పినట్టి బ్రహ్మ యజ్ఞంలో ఆరితేరినవారని స్పష్టమౌతుంది. ఆయన నిరంతరం పరమాత్మను ధ్యానిస్తూండడంవలన నివృత్తిపరమైన వేదాధ్యనంలో ఆరితేరారని తెలుస్తుంది. సద్గ్రంథపఠన గూడ బ్రహ్మయజ్ఞమేనని శాస్త్రం చెబుతుంది. ఏకనాథ బృందావనం చదవమని

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:39 మార్చి-2022 సంచిక:11

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | **సాయిబాబా సాంప్రదాయం వైదికమేనా?!** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | **పరిప్రశ్న** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | **కృతజ్ఞతామహోత్సవము** | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | **సిద్ధయ్య** | శ్రీమతి శ్రీదేవి | 11 |
| 05. | **వార్తాలాపము** | శ్రీమతి అడిదం వేదవతి | 13 |
| 06. | **మాతృదేవి స్మృతులు** | శ్రీమతి మంచిరాజు ప్రమీల | 16 |
| 07. | **ప్రేమ స్వరూపుడు** | శ్రీ కె. ఎస్.ప్రసాద్ | 19 |
| 08. | **శ్రీమతి తార్కాడ్** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 24 |
| 09. | **ద్వారకామాయి అనుభవమండపము** | విమల ; శ్రీ ఆర్. గోపాలకృష్ణ | 27 |
| 10. | **ఆచార్యుని అద్భుత లీలలు** | శ్రీ పిన్నోజు వెంకటేశ్వర్లు | 28 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

ఛీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |


సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

కాకాసాహెబ్ దీక్షిత్‌తో చెప్పారు. ఏకనాథుడట్టి గ్రంథమే వ్రాయలేదని ఆశ్చర్యపడిన కాకా 'ఏకనాథ భాగవతం' ఆయనకు చూపగా తాము పారాయణ చేయమన్నదదేనని ఆయన చెప్పారు. అది చదువుతూండగా ఒక వాక్యంలో 'ఇది ఏకనాథ భాగవతం మాత్రమేగాదు; 31 అంతస్తులుగల బృందావనమే; ఇందులో శ్రీకృష్ణుడు తన నిజరూపంలో నిత్యనివాసం చేస్తుంటాడు' అన్న వచనం కన్పించింది. అంటే ఏకనాథుడు ఆ గ్రంథాన్ని 'బృందావనం' అని గూడ వ్యవహరించాడు. అతడేవచనంలో ఏమి వ్రాసినదీ సాయికి తెలుసు! అలానే తన కూతురు వత్సలి మరణించిన శోకంలో కాకాసాహెబ్ సాయిచెంతకొచ్చాడు. అప్పుడే అతనికి పోస్టులో 'భావార్థ రామాయణం' గ్రంథమొచ్చింది. సాయి దానిలో ఒకచోట తెరచియిచ్చి అతనిని చదవమన్నారు. సరిగా అక్కడ జీవులకు జనన మరణాలు అనివార్యమని వాలి భార్యయైన తారను రాముడు వూరడిస్తున్న ఘట్టం వచ్చింది. అటు వేదమంత్రాల నుండి ప్రణవార్థధ్యానము మరియు యిట్టి సద్గ్రంథాల వరకూ అంతలా బ్రహ్మయజ్ఞం చేసినవారు మనలో ఎందరుంటారు?

## పితృ యజ్ఞం :

పితృ దేవతలు తృప్తిచెంది తరించడానికి చేసేదే పితృ యజ్ఞం. ఆత్మజ్ఞానం పొందినవారి పెద్దలు ఎన్నో తరాలవారు వెంటనే తరిస్తారని శాస్త్రం. సాయి సాటిలేని ఆత్మజ్ఞాని గనుక ఆయనకు తరించవలసిన పూర్వీకులే వుండజాలరు. అయినప్పటికీ తమ నాశ్రయించిన వారి ఆప్తులు మరణించినప్పుడు వారినందరినీ ఉత్తమ లోకాలకు పంపారు. ఉపాసనీ బాబాగారి మూడవ భార్య గతించినప్పుడు ఆయన అలానే చేశారు.

## దేవ యజ్ఞం :

దేవతల ప్రీతికొరకు యజ్ఞం చేయడమే దేవయజ్ఞం. నిత్యమూ సాయి భిక్ష చేసుకొచ్చాక మొదట కొంచెం ధునిలో వేశాకనే తాము తినేవారు. అందుకు సంప్రీతులైన దేవతలు ఆయనకు విధేయులై వుండేవారు. ఆయన ఆజ్ఞాపిస్తే వర్షం ఆగిపోయేది; పైకిలేచిన ధునిమంటలు ఆగిపోయేవి. ఒక భక్తుడు ఆయనలీల చూడదలచినపుడు ఆయన సంకల్పిస్తే పెనుగాలి వీచి వెంటనే మరలా ఆగిపోయింది.

## భూత యజ్ఞం :

అన్ని జీవులకూ ఆహారం యిచ్చి సంతృప్తి పరచడమే భూత యజ్ఞం. భక్తులు సమర్పించిన ఆవులను ఒక గోశాలలో వుంచి మేపించేవారు బాబా. ఆయన భిక్ష తెచ్చి మూతలేని ఒక మట్టిపాత్రలో వుంచేవారు. దానినుండి కుక్కలు యథేచ్ఛగా తినేవి. భోజనం చేసేముందు శక్తి వంచనలేకుండా కాకబలి బయట విడిచి రావాలని, భోజన సమయానికి మనం పిలవకనే ఆకలిగొన్న ఏ ప్రాణివచ్చినా అదే అతిథి అనీ, వాటికి ఆహారమివ్వడమే అతిథి యజ్ఞమనీ నానా చందోర్కర్‌తో సాయి చెప్పారు.

## మనుష్య యజ్ఞం :

సాయి భిక్ష తీసుకొచ్చాక ద్వారకామాయిలో తమ పంక్తిన కొందరు భక్తులకు పెట్టిన తరువాతనే ఆయన భోజనం చేసేవారు. భక్తులు తమకు సమర్పించిన రుచికరమైన వంటకాలన్నీ నిరంతరమూ భక్తులకు పంచివేస్తుండేవారు.

ఈ ఐదు యజ్ఞాలకూ తోడు మానవులు దానం గూడా చేయాలని ధర్మశాస్త్రం చెబుతుంది. ఆయనకు భక్తులు రోజూ సమర్పించే దక్షిణ, సగటున రోజుకు ₹ 500/-లు చొ॥న ఆయన అందరికీ పంచివేసేవారు. ఇంతటి దానం చేయగల సనాతనులు మనలో ఎందరున్నారు.

యజ్ఞదానాలకు తోడు తపస్సు మూడవ ధర్మం. ఇంద్రియములు మరియు మనస్సులను వివేకవైరాగ్యాలనే అగ్నిలో తపింపజేసి అవి భ్రమించకుండా పరమాత్మ యందు నిష్ఠకలిగి వుండడమే ఉత్తమమైన తపస్సని భగవద్గీతాది గ్రంథాలు చెప్పాయి. సాయి జీవితంలో ప్రతి క్షణమూ అలాంటి తపస్సేనని వారి చరిత్ర తెలుపుతుంది.

స్వధర్మాన్ననుసరించి పై కర్మలన్నీ చేయడమే యజ్ఞదాన తపస్సులని చెప్పబడిన కర్మయోగం. వాటికి తోడు సాయి శ్రమించి ఒక పూదోట మొలిపించి భక్తులకు పూజకోసం పువ్వులిచ్చేవారు. మొదటిరోజులలో రోగులకు మందులిచ్చి అవసరమైనప్పుడు పరిచర్యలుగూడ చేసేవారు. నిరంతరమూ ఎక్కడెక్కడ భక్తులనూ కనిపెట్టి ఆపదలనుండి రక్షిస్తూండేవారు. ఇంతకు మించిన సనాతన ధర్మమూర్తి ఎవరుంటారు? కాకుంటే ఆయన పైకి అలా కన్పించడానికి ఎన్నడూ ప్రయత్నం చేయలేదు. మనదృష్టిలో ఆయన చేసిన తప్పల్లా అదేనేమో!! •

# పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## ప్రశ్న :- 'ఓమిత్యే కాక్షరం బ్రహ్మ' అన్న వేదవచనానికి 'ఆదియందు వాక్యముండెను: వాక్యము దేవునియొద్ద ఉండెను; ఆ వాక్యమే దేవుడు' అన్న బైబిలు వాక్యానికి సారూప్యమున్నదా?

- బి. నా. రా. చీరాల

జవాబు :- ఈ రెండు వాక్యాలకూ సంబంధమేమీ లేదు. 'అ, ఉ, మకారాల' ఏక స్వరూపమైన 'ఓమ్ కారము 'మూడు వేదాలకు, త్రిమూర్తులకు, భూత భవిష్యద్వర్తమానాలకూ, జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలకూ - వీటి ఐక్యతకూ చిహ్నము. వీటన్నిటి సమగ్రరూపమే బ్రహ్మ అని వేద వాక్యార్థము. అర్ధతన్మాత్ర తురీయానికి చిహ్నము. ఇక్కడ ఓంకారమంటే 'వాక్కు' లేక 'వాక్యము' అని అర్థముగాదు. అక్షరమంటే 'క్షరము' లేక 'నాశము' లేనిదన్న అర్థంలో 'బ్రహ్మ' అవుతుంది. ప్రణవం బ్రహ్మతత్వాన్ని చెప్పే వాక్యమిది.

బైబిలులోని వాక్యంలో 'వాక్యము' అన్నది గ్రీకు భాషనుండి ఆంగ్లంలోకి, ఆంగ్లం నుండి తెలుగులోకి అనువదించడంలో వచ్చిన అపోహ యిది. మూలంలోని గ్రీకు పదానికి 'సంకల్పము', 'ప్రేరణ, 'ఇచ్ఛ' అని అర్థము. మొదట అద్వయుడుగా వున్న పరమాత్మ 'నేననేకమగుదునుగాక' అని సంకల్పించి, అనేకమైనాడు అన్న శృతి వాక్యానికి సంబంధించినది బైబిలు వాక్యము. 'ఆ సంకల్పం భగవంతునిలో వుండెను. కనుక ఆయనయే అయియుండెను' అని ఆ మాటకర్థం. భగవంతుని అద్వయమైన తత్వాన్ని తెలిపేది వేదవాక్యమయితే, ఆయనకు విశ్వరూపంలో ప్రకటమవుదామని కల్గిన తలంపును గురించి బైబిలు వాక్యము చెబుతుంది. ●

---

## ప్రశ్న:- కుటుంబ నియంత్రణవలన దుర్లభమైన మానవ జన్మకు అవకాశం లేకుండా చేస్తున్నాము కనుక పాపమంటున్నారు పెద్దలు నిజమా?

-ఎ. యం. రావు, హైదరాబాదు.

జవాబు:- చిన్న శస్త్ర చికిత్సతోనే జీవుల కర్మను మార్చగల్గితే యిక శస్త్రాలే దైవాలవుతాయి. అనివార్యంగా, యుగధర్మంగా వచ్చే యిటువంటి సాంప్రదాయాలన్నీ జీవుల సమిష్టి కర్మఫలంగానే వస్తాయి. కనుక పాపమేమీ గాదు. సంతతి గల్గవలసియున్నప్పుడు ఆ తల్లిదండ్రులకు కుటుంబ నియంత్రణ చేసుకోవాలన్పించదు. అలాగాక కుటుంబ నియంత్రణవలన అలా జీవుల కర్మను మార్చవచ్చని, అది పాపమనీ తలుస్తే, పెంచి పోషించగల సామర్ధ్యానికి మించి బిడ్డలను కని పోషించలేకపోవడం యింకా పాపం. 'నారు పోసినవాడు నీరు పోయడా?' అని అప్పుడు మాత్రం చెప్పేది మెట్ట వేదాంతం. నారు పోయవలసినది (కుటుంబ నియంత్రణ చేసుకొనక బిడ్డలను పుట్టించేది) మానవుడే అయితే నీరు పోయవలసినదీ వాడే. ఆ పక్షంలో కుటుంబ నియంత్రణ విషయం నిర్ణయించే బాధ్యత మనిషిదేగాని అందులో వేరే పాపమేమీ వుండదు. నారుమాత్రం మనం పోస్తాం-నీరు మాత్రం దైవం పోయాలన్నది మిథ్యావాదం. పాపంలేని కుటుంబ నియంత్రణ దంపతులిద్దరూ యింద్రియ మనోనిగ్రహం కల్గియుండడమే. అది లోపించాక బిడ్డలను కనడం పుణ్యంగాని, కనకుండడం పాపంగాని కాజాలదు. ●

(మే 2011 సాయిబాబా మాసపత్రిక నుండి)

# కృతజ్ఞతామహోత్సవము

*పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ*

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు డెబ్బది అయిదవ(75) జన్మదిన సందర్భంగా 'కృతజ్ఞతా మహోత్సవము' జరుపుకోవాలనే సంకల్పం శ్రీ సాయిమాస్టర్ భక్తులకు కలగడం ఎంతో ఆనందించదగ్గ విషయం. ఎందుకంటే పూజ్యశ్రీ మాస్టరుగారు 'కృతజ్ఞత' కు ఎంతో ప్రాధాన్యత నిచ్చారు. ఆధ్యాత్మికతలో కృతజ్ఞత ఎంతో ముఖ్యమైనదని ఆయన చెప్పేవారు. ఏ విషయంలోనైనా కృతజ్ఞత లేని జీవితం జీవితమేకాదని ఆయన బోధించేవారు.

అసలు కృతజ్ఞత అంటే ఏమిటి? ఎందుకు కావాలి? అన్నదానికి ఇక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారి తండ్రిగారైన శ్రీమాన్ ఎక్కిరాల అనంతాచార్యులవారి మాటలు గుర్తుచేసుకోవడం సమంజసం.

శ్రీమాన్ అనంతాచార్యులవారు ప్రతిరోజూ వారు భోజనం చేసేటప్పుడు మొదటగా అన్నాన్ని ఒక పెద్ద ముద్ద చేసి కాకబలికి పెట్టేవారట. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు వాళ్ళ నాన్నగారిని ఆ విషయం గూర్చి అంత పెద్ద ముద్దపెట్టి అన్నాన్ని వృధా చేయడమెందుకని ప్రశ్నించారు. అందుకు శ్రీమాన్ అనంతాచార్యులగారు చెప్పిన సమాధానం గూర్చి వివరంగా పూజ్యశ్రీ మాస్టరుగారే నందదీపం అనే ప్రత్యేక సంచికలో స్వయంగా వ్రాశారు. దానిని ఇక్కడ క్లుప్తంగా చెప్పుకుందాము.

"మానవుడు సృష్టిలోని ప్రతిదానినీ తనకోసం ఉపయోగించుకుంటున్నాడు. ఉదాహరణకు మనం తినడానికి ఈ అన్నం ముద్ద రావాలంటే భూమి, నీరు, గాలి మొ॥న పంచభూతాలేగాక, విత్తనం వేసిన దగ్గరనుంచి మన ఇంటికి చేరినదాకా ఎంతమంది శ్రమ ఇమిడి వున్నదో ఆలోచిస్తే తెలుస్తుంది. ఒక్క పండించడమే గాదు, వంట చేయడానికి కావలసిన ఇంధనము, నీరు, పాత్రలు, వాటిని తయారుచేసే మనుషులు, వండేవారు – ఇలా ఎందరో పని చేయనిదే ముద్ద లోపలకు వెళ్ళదు. ఇంతమంది శ్రమను మనం ఉపయోగించుకున్నందుకు ప్రతిఫలంగా ఈ ప్రకృతికి, ప్రకృతిలోని జీవులకూ ఏమి యిస్తున్నాము? అలాగే ప్రతి విషయంలోనూ సృష్టిలోని మిగతావాటికి ఋణపడి వున్నాము. అందుకని మనం ఆహారం తీసుకునే ముందు ప్రకృతిలోని సాటి జీవులకు కృతజ్ఞతగా అర్పించకపోతే మనం పశువులకంటే హీనమనే చెప్పుకోవాలి. కారణం పశువులు, ఇతర జీవరాశి మిగతావాటికి ఏదో ఒక విధంగా ఉపయోగపడుతూనే వున్నాయి. కనుక ప్రకృతిలోని సకల జీవరాశికీ కృతజ్ఞతగా ఒక ముద్ద అయినా పెట్టి తీరాలి. లేకపోతే మానవజన్మకు సార్థకత లేదు."

ఈ సందర్భంగా పూజ్యశ్రీ మాస్టరుగారిలా అంటారు: "నాన్నగారు ఆ రోజు చెప్పిన మాటలు నా చెవులలో ఇంకా మార్మోగుతునే వున్నాయి. నన్ను నిద్రపోనివ్వడం లేదు. నేను తీసుకునే ప్రతి ముద్దా నన్ను ప్రశ్నిస్తూనే వున్నది". అంటే పూజ్యశ్రీ మాస్టరుగారి నాన్నగారు చెప్పిన మాటలలో ఎంత లోతు అర్థముందో మనం గ్రహించవచ్చు.

పూజ్యశ్రీ మాస్టరుగారు యింకా యిలా అంటారు: "కృతజ్ఞత అనేది మానవ జీవితములో అతి ప్రధానమైన అంశము. కారణం మానవ జీవతమంతా సమాజం మీద ఆధారపడి వుంటుంది. జన్మించడానికి తల్లి గర్భాన్ని ఆశ్రయించాలి. పోషించడానికి తండ్రి, విద్య నేర్పడానికి గురువు, తర్వాత భార్య, భర్త, బిడ్డలు – ఇలా జీవితంలో ఇతరుల మీద ఆధారపడక తప్పదు. అందుకే కృతజ్ఞతగా వీరందరి ఋణమూ తీర్చుకోవాలని పెద్దలు చెప్పారు.

అయితే ఏమి చేసి వీరందరి ఋణము తీర్చుకోవాలి? అంటే తల్లిదండ్రులసేవ, వారి పాలన పోషణ, భార్యాపిల్లల పట్ల బాధ్యత, అలాగే బంధుమిత్రులపట్ల సహకారము, సమాజం పట్ల ఉపకారగుణము – ఇవన్నీ నిర్వర్తించాలని చెప్పారు.

అయితే అన్నింటికంటే గొప్పదైన, అతి ముఖ్యమైన ఋణమొకటున్నది. అదే గురు ఋణము. దానిని ఏమి, ఎంత యిచ్చి తీర్చుకోగలము? కృతజ్ఞతగా ఏమి చేయగలము?

కారణం–మనకు అన్నీ సమృద్ధిగా వున్నప్పటికీ ఏదో ఒక కొరత, తీరని ఆకలి, దాహము వెన్నాడుతూనే వుంటాయి. ఉదాహరణకు ఒకనికి తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు, సిరిసంపదలు, ఆరోగ్యము పుష్కలంగా వున్నాయనుకుందాము. కానీ అతనికి గూడ ఏదో కావాలనే కాంక్ష, అది తీరదేమోనని భయము – ఇలా అంతులేని కోరికల వల్ల అశాంతికి గురి అవుతూ వుంటాడు. లేకపోతే ఏవో ఇతర కారణాలుగా మనశ్శాంతి కరువవుతుంది. కారణం ఇంట్లోని వ్యక్తులు గావచ్చు. ఇతరులు కావచ్చు. ఇంట్లో పరిస్థితులు కావచ్చు. బయట పరిస్థితులు కావచ్చు. అయితే ఈ అశాంతికి కారణమేమిటి? దీని మూలమేమిటి? దీనిని పోగొట్టుకునేదెలా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానంగా నిలుస్తారు సద్గురువులు. వారు దీనికి పరిష్కార మార్గాలనెన్నింటినో సూచించారు. వాటిననుసరించి సాధన ఎలా చేయాలో వివరించారు. ఈ ప్రాపంచిక సుఖాల లోతేమిటో, అవి ఎంతటి అసత్యాలో వాటిని గూర్చి ఆశపడి వెంపరలాడడం ఎంతటి అజ్ఞానమో, వాటి నుండి బయటపడడమెలాగో తెలియజెప్పారు. అట్టి గురువుల ఋణం ఏమిచ్చి తీర్చుకోవాలి? ఇది ఎంతైనా ఆలోచించదగ్గ విషయం.

ఈ అశాంతి నుంచి బయటపడడానికి అనేక కోణాలలోంచి శోధించి, సాధన చేసి గమ్యం చేరిన గురువులు కొందరైతే, తాము సాధన కొనసాగిస్తూనే ఇతరులకు బోధించే గురువులు కొందరు. అంతేగాక తాము పరిపూర్ణులైనప్పటికీ మానవజాతి ఉద్ధరణకోసం అవతరించే మహాత్ములు కొందరు. వారు లోకానికి ఆదర్శంగా వుండడానికి మాత్రమే సాధనలు చేస్తారు. అదే బోధిస్తారు.

సామాన్యంగా గురువులు సాధనను ఎలా చేసుకోవాలో శిష్యులకు బోధిస్తారు. వాటిని అమలుపరచుకోవడము శిష్యుల కర్తవ్యము. ఒకవేళ ఆయా సాధనలలో సంశయాలు, అవరోధాలు ఏర్పడినప్పుడు వారు వాటిని తీరుస్తారు. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారి బోధనా విధానము, పరిష్కారము గూడ ప్రత్యేకంగా కనిపిస్తాయి. ఎందుకంటే మాములుగా మనం ఏ సాధన చేసినా ఆ సాధనలోని అవరోధాలను తొలగించుకుంటూ ముందుకు పోవడం జరుగుతుంది. అందులో ఒక స్థాయికి గూడ సాధకుడు చేరుకోవచ్చు. ఉదాహరణకు ఒకడు యోగసాధన చేసాడు. అందులో అతడు ఒక స్థాయికి చేరుకున్నాడు. అలాగే మరొకడు సాయిబాబాను సేవించాడు. అతడు మంచి భక్తుడయ్యాడు. ఎవరే సాధన చేసినప్పటికీ వాళ్ళవల్ల కొన్ని మహిమలు గూడ జరుగవచ్చు. కానీ అప్పటికీ వారిలో కామక్రోధాది గుణాలు నశించవు. అందుకని సాధనలో వారెంత పై స్థాయికి వెళ్ళినా వారి మనస్సు వీటిని అంటిపెట్టుకునే వున్నదన్నమాట. అందుకని వారికి ఎవరైనా తమకంటే గొప్పవారని అంగీకరించడం ఇష్టముండదు. కీర్తి కాంక్ష, ధన కాంక్ష మొ॥న బలహీనతలు అలాగే వుండడం వల్ల వారు గూడ అశాంతికి గురి అవుతారు. వెనుకటి ఋషులకు మానసిక శక్తి వుండేది గనుక ఇతరులకు శాపమిచ్చేవారు. ఇప్పటివారు అంతటి స్థాయికి చేరుకోకపోయినా తమ బుద్ధిబలంతో ఆలోచించి శిష్యగణంతో అవతలివారిని దెబ్బతీయాలని ప్రయత్నిస్తుంటారు. తమ వద్దకు అనేక మంది ప్రజలు రావాలని, తమ ఉపదేశాలు విని తమను కీర్తించాలనీ ఆశిస్తుంటారు. అందుకని ఈనాడు చాలమంది గురువుల మధ్య, నేటి రాజకీయ నాయకులలో వలె ఎన్నో విభేదాలు, అసూయాద్వేషాదులు వుంటూంటాయి. ఇక మాములు మనుషులకు, వీరికీ తేడా ఎక్కడుంది?

అందుకని అటువంటివారిని ఆశ్రయించేవారు కోరికలు తీర్చుకోవడానికి మాత్రమే వెళ్తుండడం సామాన్యంగా జరుగుతూ వుంటుంది. సామాన్యులమైన మనకు అది సహజమే.

కానీ పూజ్యశ్రీ మాస్టరుగారు బోధించే మార్గం భిన్నమైనది. ఆయన మనలను సూటిగా యిలా ప్రశ్నిస్తారు: "బాబాను సేవించావు. కోరికలు తీరాయి. కానీ మనశ్శాంతి లభించిందా? 'నేను హాయిగా వున్నాను' అని గుండెమీద చేయి వేసుకుని చెప్పగలవా?" అని. దానికి మన దగ్గరవున్న సమాధానమేమిటి? 'లేదు' అని మాత్రమే. మరి సాయిబాబాను సేవించినా, ఇతర మహాత్ములను సేవించినా, వేరే ఏదైనా సాధన చేసినా మనకు మనశ్శాంతి ఎందుకు లభించడం లేదు? మరి నాస్తికులకు మనకూ భేదమేమిటి?

ఈ ప్రశ్నలకు సమాధానమే పూజ్యశ్రీ మాస్టరుగారి జీవితము, బోధ. ఎన్ని సాధనలు చేసినా మనశ్శాంతి లేకపోవడం ఎందుకని జరుగుతున్నదని ప్రశ్నించుకుని దానికి సమాధానాన్ని ఆయన కనుగొన్నారు. అదే మన మనస్సు యొక్క ప్రస్తుత స్థితి! మనకు అనుక్షణం ఎదురవుతున్న సంఘటనల పట్ల మన భావాలను సరిదిద్దుకోవడం. బుద్ధుడు, రమణమహర్షి గూడ విచారణ చేసి మనస్సే అన్నింటికీ మూలమని చెప్పినప్పటికీ వారు చెప్పిన సాధనా విధానములు సర్వమూ త్యజించినవారికి తప్ప ఆచరించడానికి సామాన్యులకు అంత సులభంగా అనిపించవు. పూజ్యశ్రీ మాస్టరుగారు గూడ ఈ విషయమే చెప్పినప్పటికీ ఆయన చెప్పే సాధనా విధానము వేరుగా వుంటుంది, సామాన్య మానవులకు అలా కూర్చుని మనస్సు గురించి, మనస్సుకు వచ్చే ఆలోచనలు గురించి, అవరోధాల గూర్చి ఆలోచించుకునే సమయముండదు, ఇష్టమూ వుండదు. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారు అందుకు భిన్నమైన, సులభమైన, విశిష్టమైన మార్గాన్ని సూచించారు. అదే – మనకు అనుక్షణమూ సంభవించే సంఘటనల పట్ల మన మనోభావాలను గమనించడము, సరిదిద్దుకోవడము.

"ఉదాహరణకు ఒకడు మనపట్ల పొరపాటు చేసాడు. అది కావాలనీ కావచ్చు, కాకతాళీయంగానూ కావచ్చు. కానీ ఆ సంఘటన పట్ల మనం ఏవిధంగా ప్రతిస్పందిస్తాము అన్నదాని మీద మన మనస్సు యొక్క ప్రభావము ఆధారపడివుంటుంది. ఉదాహరణకు మనకు ఒకరి కాలు తగిలింది. అది అతడు కావాలని చేసివుండవచ్చు, పొరపాటున జరిగి వుండవచ్చు. కానీ అతడు అలా ఎందుకు చేసినా మన ప్రతిస్పందనను బట్టే మన మనశ్శాంతి వుంటుంది. ఒకవేళ అతడు కావాలని చేసినా మనం తేలికగా తీసుకుంటే చికాకు, కోపము ఎందుకు వస్తాయి? మనశ్శాంతి రాక ఏమవుతుంది?" అంటారాయన. ఇలాగే మనం అనుక్షణమూ చిన్న విషయాల దగ్గర నుంచి పెద్ద విషయాలు వరకూ ప్రతిదానికీ ఏదో ఒక విధంగా బాధపడుతూ మనశ్శాంతి కోల్పోవడమే ఎక్కువగా జరుగుతూ వుంటుంది. ఇలాంటి పరిస్థితులలో మన జీవితాలు సజావుగా, శాంతిగా ఎలా సాగుతాయి? ఈ సమస్యకు పరిష్కారమేమిటి?

దీనికే చక్కని మార్గాన్ని పూజ్యశ్రీ మాస్టరుగారు తెలియజేశారు. పరిస్థితుల పట్ల, ఇతరుల పట్ల మనకు వచ్చే ఆలోచనలు, దాని ప్రభావాలను గుర్తిస్తూ వాటిని వివేకంతో ఎలా ఆలోచించి సరియైన మార్గానికి త్రిప్పుకోవాలో, తద్వారా మన బలహీనతలను ఎలా తొలగించుకోవాలో తెలియజేశారు. అనుక్షణమూ చింతలతో కృగ్గిపోతున్న మానవాళికి సరియైన మార్గంలో ఎలా నడవాలో తెలిపి శాంతి మార్గాన్ని తెలియజేసిన మహా మహిమాన్వితులు పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు.

అంతమాత్రం చేత ఆయన మనలను అన్నీ వదలి పూర్తిగా ఆధ్యాత్మిక మార్గంలోనే జీవించాలని బోధించలేదు. సంసారంలో వుంటూనే ఆధ్యాత్మికతను ఎలా సాధించుకోవచ్చో ఆయన తెలిపారు. ఆధ్యాత్మికత, లౌకికత వేరుగావని, లౌకికత ద్వారా ఆధ్యాత్మికతను సాధించవచ్చని ఆయన చెప్పేవారు.

నేటి మానవులు ఆధ్యాత్మిక మార్గంలో వున్నా లేక లౌకికతలో వున్నా మనశ్శాంతి లేకుండా, ఉత్సాహము, చైతన్యము లేక జీవచ్ఛవాల్లా జీవిస్తున్నారు. తింటున్నారు, కట్టుకుంటున్నారు, కార్లలో తిరుగుతున్నారు, పదవులలో వుంటున్నారు, మంచి ఉద్యోగంలో వున్నారు. కానీ అశాంతిలో కుతకుతలాడిపోతూ – జీవించడమంటే ఏమిటో తెలియక – ఎవరికి తోచిన విధంగా వారు

ప్రవర్తిస్తున్నారు.

ఇటువంటి పరిస్థితులలో మనలను ఉద్ధరించడానికి శ్రీ సాయిబాబా తమ ముద్దుబిడ్డడైన పూజ్యశ్రీ మాస్టరుగారిని మన మధ్యకు పంపించారు. ఆశ్రిత కల్పవృక్షమైన శ్రీ శిరిడీ సాయిబాబాను గూర్చి చెబుతూనే ప్రాపంచిక జీవితంలో సుఖశాంతులను పొందడమెలాగో ఆయన చెప్పడమేగాక, ఆచరించి చూపారు గూడ. నేడు ఆయన బోధల ద్వారా, ఆయన రచించిన 'శ్రీ సాయిలీలామృతము' గ్రంథము ద్వారా కొన్ని కోట్ల మంది ప్రభావితులై ఐహిక కోరికలు తీర్చుకోవడమే గాక, పరిస్థితుల పట్ల అవగాహన కలిగి, శ్రీ సాయిబాబా మీద విశ్వాసముతోనూ, వివేకంతో ఆలోచించడం ద్వారానూ మనశ్శాంతి పొందుతున్నారు.

అంతేగాక సామాజిక పరిస్థితులను అన్ని కోణాల నుంచి విశ్లేషించి అనేక మార్గాలను ఆయన సూచించారు.

నేడు పాశ్చాత్య ప్రభావంతో సరియైన మార్గం తెలియక వెర్రితలలు వేస్తున్న సమాజానికి సరియైన జీవన విధానమెలాగో ఆయన తెలిపారు. మత మౌఢ్యంతో కొట్టుకుంటున్న ఛాందసులకు కనువిప్పుకలిగేలా 'మతమెందుకు?' అనే గ్రంథం ద్వారా అసలు మతమంటే ఏమిటో తెలియజేశారు.

సత్యమేమిటో తెలియక నాస్తిక ప్రభావంతో భగవంతుడే లేడనే నాస్తికులకు, నేటి విజ్ఞానశాస్త్ర ప్రమాణం లేనిదే భగవంతుడు వున్నాడని నమ్మని హేతువాదులకు, 'ఏది నిజం', 'విజ్ఞాన వీచికలు' అనే గ్రంథాలు రచించడం ద్వారా భగవంతుడు వున్నాడని ఆధునిక విజ్ఞాన శాస్త్రం ద్వారా సప్రమాణికంగా నిరూపించారు.

అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటో, నిజమైన ఆధ్యాత్మికవేత్తలు ఎలా వుంటారో తెలిపి ప్రజలను నేటి దొంగ గురువుల బారిన పడకుండా వుంచడానికి ప్రయత్నించారు. తమ జీవితమంతా ప్రతి విషయంలోనూ నిజానిజాలను చెప్పడానికి ప్రయత్నిస్తూ, ధర్మబద్ధమైన జీవితం ఎలా వుంటుందో తమ ఆచరణ ద్వారా నిరూపిస్తూ, విశ్రాంతి అన్నది లేకుండా అహర్నిశలూ మనందరికోసం శ్రమించిన ఆ కారుణ్యమూర్తికి మనం అర్పించగలదేమున్నది? – కృతజ్ఞత తప్ప! అదీగాక అయన కోరేది ఏమైనా వున్నదా? అసలాయనకు ఏమి కావాలి?

ఆయనకే కాదు, అసలైన ఆధ్యాత్మికవేత్తలెవరికీ ఏమి అక్కర్లేదు. 'ఏమి అక్కర్లేదా! అయితే వాళ్ళు అంతగా ఎందుకు శ్రమపడినట్లు?' అంటారేమో! నిజమే! ఏ ఫలితాన్ని ఆశించకుండా అంతటి శ్రమ ఎవరూ పడరు. అయితే ఆయనకు ఏమి కావాలి? అవును. ఆయనకూ కావాలి. అదే – ఆయనపట్ల కృతజ్ఞత! ప్రేమతో నిండిన కృతజ్ఞత. ఆయన చెప్పినవాటిని ఆచరించడమే కృతజ్ఞత. ఆచరించడానికి ప్రయత్నించే కృతజ్ఞత. ఆయన అనుకున్నట్లు అందరమూ మానసిక, ఆరోగ్య, ఐహిక, ఆముష్మిక శాంతులతో జీవించడమే ఆయన కోరుకునే కృతజ్ఞత. అయితే అది మనమివ్వగలమా? ఎందుకివ్వలేము? ప్రయత్నిస్తుంటే తప్పక ఇవ్వగలము. మన మివ్వగలగడానికి తమ సహస్ర కరములనందిస్తూ ఆయన మన ఎదుట, మన ప్రక్కన, మన చుట్టూ, మన లోపల ఎప్పుడూ వున్నారు. వుంటారు గూడ. అందుకు సహకారంగా అందరమూ కలిసి మనకు తల్లి, తండ్రి, సఖుడు, గురువు, దైవమూ అయిన పూజ్యశ్రీ మాస్టరుగారికి కృతజ్ఞతా పూర్వకంగా 'కృతజ్ఞతామహోత్సవము' ను మన శక్తి మేరకు ఘనంగా, అత్యంత వైభవంగా జరుపుకుందాము. అలా ఎంతో సంతోషంతో, కృతజ్ఞతతో జరుపుకోవడానికి కావలసిన శక్తినివ్వమని ప్రార్థిస్తూ, ఆయన వ్రాసిన, ఆయన వ్రాయమని సూచించిన, ఆయన గూర్చిన గ్రంథాలనన్నింటినీ పారాయణలు చేద్దాము. నామస్మరణ చేద్దాము. జప, ధ్యానములు చేద్దాము. సత్సంగముల ద్వారా ఆయన బోధలను, ఆశయాలను నలుగురితోనూ పంచుకుందాము. తద్వారా ఆయన సాయిబాబాకు ముద్దుబిడ్డ అయినట్లే మనమూ ఆయనకు తగిన బిడ్డలమవుదాము. అందరమూ కలిసి ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఇప్పటి నుంచే ఉన్ముఖులవుదాము. ఆయన కృపాశీస్సులను పొందుదాము.

ఈ పవిత్ర 'కృతజ్ఞతామహోత్సవము' నకు తమ ఆశీస్సులనందించమని శ్రీ శిరిడీ సాయినాథుని, పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారినీ హృదయ పూర్వకంగా ప్రార్థిద్దాము.●

(గత సంచిక తరువాయి)

# సిద్ధయ్య

**శ్రీమతి శ్రీదేవి**

తెల్లవారింది. అప్పటికే నిద్రలేచి ఇంటి పనులలో పడింది ఆదంబీ. "సిద్ధా! ఇంకా నిద్ర లేవలేదా? బాగా పొద్దెక్కింది, లే నాయనా!" అంటూ సిద్ధయ్య గదికి వెళ్ళి చూసింది. గదిలో సిద్ధయ్య లేడు. ఇల్లంతా వెదికింది. ఆమె కంగారు చూసిన పీర్ సాహెబ్, "ఏ మశీదుకో, గుడికో వెళ్ళి వుంటాడు" అన్నాడు. ఎంత సమయం గడిచినా సిద్ధయ్య రాలేదు. తల్లిదండ్రులిరువురి మనసులలో ఆందోళన మొదలైంది. సిద్ధయ్య దైవభక్తి, ఐహిక సుఖాల పట్ల విముఖత, వివాహంపై అనాసక్తి, ముఖ్యంగా అతడు సాధుసన్యాసుల పట్ల కనపరిచే భక్తి, వారి జీవితవిధానంపై చూపే ఆసక్తి, యివన్నీ గుర్తొచ్చి వారి ఆందోళన మరింత తీవ్రం కాసాగింది.

సాయంత్రమైంది. సిద్ధయ్య రాలేదు. ఆదంబీ దిగులుతో వంట చేయలేదు. సాహెబ్ ఊర్లో అన్ని చోట్లా సిద్ధయ్య కోసం వాకబు చేస్తూనే వున్నాడు.

ఎక్కడికి వెళ్ళాడో! రాత్రి ఏ వేళకైనా తిరిగి రాకపోతాడా! అన్న ఆశతో కళ్ళల్లో వత్తులేసుకొని నిద్రాహారాలు మాని సిద్ధయ్య కోసం ఎదురు చూసారా దంపతులు. రాత్రంతా గడిచింది.

తెల్లవారింది. సిద్ధయ్య జాడలేదు. ఆ తల్లిదండ్రుల గుండెలు బ్రద్దలైనాయి. లేకలేక పుట్టిన ఒక్కగానొక్క కొడుకు! ఎక్కడికి వెళ్ళాడు? ఏమైనాడు? ఇదే ఆందోళన! వారి హృదయరోదన!

"సిద్ధా! సిద్ధా! అని ఏడుస్తూ బంధువుల యిళ్ళన్నీ వెతుకుతున్నది ఆదంబీ. తెలిసిన వారినీ, తెలియని వారినీ కూడా సిద్ధయ్య గురించి అడుగుతూ యిరుగు పొరుగు గ్రామాలన్నీ తిరుగుతున్నాడు సాహెబ్.

కొన్ని రోజులు అలానే గడిచాయి. సిద్ధయ్య పై బెంగతో తిండి తిప్పలు లేక వారిరువురి దేహాలు శుష్కించి పోసాగాయి.

ఒక రోజు కందిమల్లయ్యపల్లెలోని శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి వద్ద సిద్ధయ్య వున్నాడని మిత్రులొకరు సాహెబ్‌కు చెప్పారు. అంతే! ఆనందంతో పొంగిపోయా రాదంపతులు.

"హమ్మయ్య! మన బిడ్డ ఎక్కడో ఒక చోట క్షేమంగా వున్నాడు. అది చాలు మనకి!" అనుకున్నారు. "మనం వెంటనే వెళ్లి మన బిడ్డను తీసుకొద్దాం పద" అన్నది బేగం. ఇరువురూ కంది మల్లయ్యపల్లె బయలుదేరారు.

★★★

నిమిషాలలో యీ వార్త గ్రామమంతా గుప్పుమంది. ముడుమాల గ్రామంలోని ముస్లింల హృదయాలు భగ్గుమన్నాయి.

"ఒక ముస్లిం యువకుడు హిందువుల ఆశ్రమంలో అడుగుపెట్టటమా? ఎంత ధైర్యం! ఇది మన ఇస్లాంకు విరుద్ధం. అల్లా సహించడు. మనం ఏ మాత్రం ఈ ద్రోహాన్ని సహించకూడదు" అన్నాడొక ముసల్మాన్ యువకుడు ఆవేశంగా.

"అవును, ఎంత మాత్రం సహించకూడదు" అన్నారు మిగతావారంతా.

"మనం యిప్పుడే ఆశ్రమానికి వెళ్దాం. తాడో పేడో తేల్చుకుందాం" అన్నారొకరు.

"ఆగండి!" అన్నాడొక ముస్లిం పెద్ద.

"తొందర పడవద్దు. మన సాహెబ్ కొడుకును వెంటబెట్టుకుని వస్తాడు కదా, అప్పుడు తెలుస్తుందిగా అసలేమయిందో, ఆ బద్మాష్ అక్కడికెందుకెళ్లాడో. అప్పటి దాకా వేచి చూద్దాం" అని సలహా ఇచ్చాడా పెద్దమనిషి. అంతటితో ఆ చర్చ ఆగింది.

అయితే, నివురుగప్పిన నిప్పులా మారింది 'ముడుమాల' గ్రామంలోని ముస్లింవాడ.

★★★

అరుణోదయ వేళ! శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారు అప్పుడే నిశ్చల సమాధి నుండి మేల్కొన్నారు. కొద్ది నిమిషాలు గడిచాయి. స్వామి అలౌకిక స్వరంతో నెమ్మదిగా పిలిచారు, "సిద్ధా!" అని. స్వామి ఎదుటనే చేతులు జోడించి స్వామినే ఆనంద పారవశ్యంతో తిలకిస్తూ కూర్చున్న సిద్ధయ్య ఉలికిపడి "స్వామీ!" అన్నాడు, ఏమి చెప్పబోతున్నారో అన్న ఆతృతతో.

స్వామి: నాయనా! నేను చెప్పబోయే విషయాన్ని జాగ్రత్తగా విని అవగాహన చేసుకొనటానికి ప్రయత్నిస్తా వనుకొంటాను.

సిద్ధుడు: సెలవీయండి స్వామీ!

స్వామి: జన్మ జన్మల ఋణానుబంధాలు, కర్మానుబంధాలు మన వెంట నంటే వుంటాయి. ఆ బంధాలు వీడనిదే ముక్తికి మార్గం సుగమం కాజాలదు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల సేవ మానవుడి కర్తవ్యం. వారిని వేదనకు గురి చేయటం దోషం. వారి అనుమతితో వస్తే ఆ దోషం వుండేది కాదుగా.

సిద్ధుడు: గురుదేవా! మమకార మాయాజాలంలో చిక్కుకొని వున్న నా తల్లిదండ్రులు ఒక్కరోజైనా నన్ను చూడకుండా వుండలేరు. ఇక, శాశ్వతంగా మీ సన్నిధిలో తరించాలన్న నా తపనను ఎలా అర్థం చేసుకోగలరు స్వామీ! అందుకే అలా చేయవలసి వచ్చింది.

స్వామి: ఇంతకంటే కూడా ముఖ్యమైన విషయం ఆలోచించావా నాయనా?

సిద్ధుడు: ఏమిటి స్వామి?

స్వామి : మానవుడు సంఘజీవి. సమాజపు కట్టుబాట్లు సమాజ శ్రేయస్సు కోసమే ఏర్పాటు చేయబడ్డాయి. వాటిని అతిక్రమించి ప్రవర్తిస్తే సాంఘిక జీవనం, వ్యక్తిగత జీవితం కూడ అస్తవ్యస్తమౌతాయి. ముసల్మాను యువకుడు వైయుండి హిందూమతస్థుడైన గురువును ఆశ్రయించటం వలన స్వమతస్థుల ఆగ్రహానికి గురి అవుతావు.

సిద్ధుడు: గురుదేవా! సాక్షాత్తు భగవత్స్వరూపులయిన మీ అనుగ్రహం ముందు వారి ఆగ్రహం నన్నేమి చేయగలదు స్వామీ!

స్వామి (నవ్వుతూ): సిద్ధా! నీ నిర్ణయం వలన నాకు కూడా లోకనింద వస్తుందేమో ఆలోచించావా? ముసల్మాను యువకుడిని లోబరచుకొన్నానన్న అపవాదు నాపై మోప బడుతుందికదా!

సిద్ధుడు: గురుదేవా! మీరు సర్వాంతర్యామి! నిందాస్తుతుల కతీతులు. సృష్టి స్థితి లయ కారకులు, సర్వసమర్థులు. సర్వమతాలు మీ నుండే పుట్టాయి. మిమ్మల్ని ఆశ్రయించిన నాకు స్వమతస్థుల నుండి భయమేమీ లేదు స్వామి! మీ దివ్యత్వాన్ని గుర్తించలేని అజ్ఞానులు మీపై వేసే అపనిందలు సూర్యునిపై విసరబడిన దుమ్ముకణాల వలె అవి వారి కళ్ళల్లోనేపడి వారినే బాధిస్తాయి గాని మిమ్మల్నేమి చేస్తాయి స్వామీ!

స్వామి: సిద్ధా! కొందరు ఒక ఉన్నతమైన లక్ష్యం కోసం ఎన్నో కష్టాలకోర్చి ముందుకు సాగుతారు. చివరకు లక్ష్యసిద్ధిని సాధిస్తారు. అటువంటి వారు కొన్ని సామాజిక కట్టుబాట్లను అతిక్రమించి ప్రవర్తిస్తే, అది వారి వ్యక్తిగత జీవితానికి, సమాజానికి కూడా మేలే చేకూరుస్తుంది కానీ అపకారము చేయదు. కానీ సగటు మానవుడు అంతటి స్థాయిలో వుండడు. అలాంటి వారు సమాజ కట్టుబాట్లకు లోబడి బ్రతకటమే వారికీ, సమాజానికి కూడా శ్రేయస్కరం. ఎవరి ధర్మాన్ని వారు అనుసరించటం శ్రేయస్కరం.

సిద్ధుడు: గురుదేవా! సర్వధర్మాలూ మీలోనే వున్నాయి. ధర్మస్వరూపులయిన మీ సన్నిధి, మీ సేవను మించిన ధర్మం నాకు మరొకటి కన్పించటం లేదు.

సిద్ధుడు తలవంచుకొని కన్నీరు కార్చసాగాడు.

స్వామి: సిద్ధా! నిబ్బరంతో ఆలోచించు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల బాధ అర్థం చేసుకో. దుఃఖాన్ని నిగ్రహించుకొని, యింటికి వెళ్ళి వారిని సేవించుకో నాయనా.

సిద్ధుడు: గురుదేవా! మీరేమంటున్నారు? తల్లిదండ్రుల మమకార బంధాలలో చిక్కుబడి పోతానా లేదా అనీ, స్వమతస్థుల ఆగ్రహానికి భయపడతానా లేదా అనీ నన్ను పరీక్షించటానికే యిలా మాట్లాడుతున్నారా? కన్నవారి ప్రేమ, సమాజపు కట్టుబాట్లు నాకు ముఖ్యమనిపించటం లేదు. మీరు తప్ప నాకు యీ లోకంలో ఏదీ పట్టటం లేదు. స్వప్న దర్శనమిచ్చి చేరరమ్మని పిలిచి యిప్పుడిలా వెళ్ళిపొమ్మనటం న్యాయమా స్వామి? నన్ను దయ చూడండి. నా సర్వస్వం మీరే. మిమ్మల్ని విడిచి బ్రతుకలేను. నా దైవమా! నా గురుదేవా! కరుణించు అంటూ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి పాదాలపైబడి గుండెలు పగిలేలా ఏడ్వసాగాడు సిద్ధుడు.

**- సశేషం**

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

*శ్రీమతి అడిదం వేదవతి*

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## ఎనిమిదవ ప్రసంగము

### అసుర సంపద

స్వా॥ప్ర॥ :- ఈ విధంగా బ్రహ్మసుఖము అభూత కల్పన అని భావించి, ప్రత్యక్షముగా అనుభవానికి వచ్చే విషయసుఖమే సత్యమని తలచి ద్రవ్యాలపట్ల (ధనము మొ॥న వాటిపట్ల) లోభబుద్ధి కల అసురసంపద కల మానవుడు పరలోక జ్ఞానాన్ని పొందడు. మాటిమాటికీ యమపాశం చేత బంధింప బడుతుంటాడు. ఈ విషయంలో యముడు నచికేతునికి ఇలా చెప్పాడు –

*శ్లో॥ న సాంపరాయః ప్రతిభాతి బాలం*
*ప్రమాద్యన్తం విత్తమోహేన మూఢమ్।*
*అయం లోకోనాస్తి పర ఇతి మానీ పునః*
*పునర్వశ మాపద్యతే మే॥*

భావం : అవివేకి, మదించినవాడు అయిన ధనవ్యామోహం కల మూఢునికి పరలోక జ్ఞానము కలుగదు. "ఇది ఒకటే లోకము. మరొకటి లేదు" అనేవాడు నా చేతిలో చిక్కుకుంటాడు. అంటే రోజురోజుకూ నీచజన్మ పొంది దుఃఖిస్తాడు.

ఇలా వారి కర్మలన్నీ వ్యర్థమౌతాయన్నది స్పష్టము. యముడు ఈ శ్రుతిలో 'బాల' శబ్దాన్ని ప్రయోగించాడు. 'అజ్ఞో భవతి వై బాలః' అని మనువు చెప్పాడు. అంటే వస్తువును వస్తురూపంలో తెలుసుకోలేనివాడు బాలుడు.

ఇలా చార్వాక మతస్థులు స్వర్గసుఖాన్ని, మోక్షసుఖాన్ని పుక్కిటి పురాణమని, ఈ లోకంలోని ప్రత్యక్షసుఖము సత్యమని తలచి విషయాలలో తగులుకుంటారు. క్రూరత్వంతో విషయపదార్థాలను పొందడానికి ధనాన్ని సంపాదిస్తారు. కాబట్టే 'మోఘ కర్మాణః' అని చెప్పబడినది.

### భగవద్గీతలో చెప్పబడిన అసుర, రాక్షస ప్రకృతులు

*రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః॥*

భావం : జనులు మోహకారకాలైన రాక్షస, అసుర ప్రకృతులను పొందుతారు.

రాక్షసులు హింసాపరులు, ద్వేషపూర్ణులు. రాక్షసులు ఇతరులను శరీరముతోనూ, వాక్కుతోనూ, మానసికమైన ద్వేషాలతో బాధిస్తూ వుంటారు. తిడుతూ వుంటారు, కొడుతూ వుంటారు. ప్రాచీనకాలపు కంసుడు, జరాసంధుడు మొ॥న క్రూరరాజులు మూర్తీభవించిన రాక్షసప్రకృతులు.

అసురులు రాగపూర్ణులు, విషయలాలసులు. అసురసంపద కల మానవుల లక్షణము 'అసుషు రమతే ఇతి అసురః' అని చెప్పబడింది. ఇంద్రియసుఖాల పట్ల ఆసక్తి, సరదా కలిగి వున్నవారు అసురులు. ఐదు ఇంద్రియాలకు సంబంధించిన విషయ పదార్థాల పట్ల వ్యామోహం (రాగ బుద్ధి) కలిగి వుండడం అసురప్రకృతికి లక్షణము.

పూర్వకాలంలో యయాతి అనే రాజు ఎన్ని సంవత్సరాలు విలాస జీవితం గడిపినా అతనికి తృప్తి కలుగలేదు.

రాక్షస, అసుర ప్రకృతుల విషయంలో 'శ్రీ వంశీధర మిశ్రగారు' తన సాంఖ్యటీకలో ఇలా వ్రాశారు:

రాక్షస ప్రకృతి అంటే ద్వేషము. దానిలో క్రోధము, ఈర్ష్య, అసూయ, ద్రోహము, హింస, అమర్షము, అవమానము అనే గుణాలు వుంటాయి.

*1. **క్రోధము** :* ఏదో ఒక ప్రత్యేకమైన దోషం వలన మనసు బాధపడుతుంది. కనుక క్రోధము కల మానవుడు పళ్ళు పట పట కొరుకుతాడు. కన్నెర్ర జేస్తాడు. క్రోధంలో తనను తాను మరచిపోయి ఇతరుల మీద మీదకు వెళతాడు. అతడు క్రోధంలో నోటికి వచ్చినట్లు తప్పుడు మాటలు మాట్లాడుతాడు.

*2. **ఈర్ష్య** :* దాయాదుల మధ్య విభజన సందర్భంలో భాగస్వాముల మధ్య జన్మించే పరస్పర ద్వేషము.

*3. **అసూయ** :* ఇతరుల సుగుణాలను, అభివృద్ధిని సహించలేకపోవడం.

*4. **ద్రోహము** :* ద్వేషం వలన ఇతరులను నశింపజేయాలనే కోరిక.

*5. **హింస** :* ఇతరులను బాధించటం. ద్రోహము వలన హింస జన్మిస్తుంది.

*6. **అమర్షము** :* అశక్తుడు, అసమర్థుడు అయిన మానవుని పట్ల అతడు చేసిన తప్పును గురించి సమర్థుడు పొందే ద్వేషము.

*7. **అవమానము** :* ఏ కొంచెము అపకారం ఇతరులు చేసినా, దాని గురించి మనస్సులో ఎక్కువ బాధను పొంది ద్వేషానికి అవకాశమివ్వడం.

అసుర ప్రకృతి అంటే రాగము. దానిలో కామము, మాత్సర్యము, వాంఛ, ఆశ, లోభము, మాయ, దంభము వుంటాయి.

*1. **కామము** :* రమించాలనే కోరిక.

*2. **మాత్సర్యము** (**మత్సరము**) :* తనకేమీ ఉపయోగం లేకపోవడం వలన ఇతరుల అభిప్రాయాలను నిరాకరించడం, ఇతరుల గుణాలను గుణాలుగా తలచకపోవడం.

*3. **వాంఛ** :* ధర్మానికి విరుద్ధంగా మాయ నుంచి పుట్టిన ధనము మొ॥న వాటిని సంపాదించాలనే కోరిక.

*4. **తృష్ణ** :* 'నన్ను తక్కువవాడిగా ఎవరూ తలచకూడదు' అనే భావం. ధనాన్ని వెచ్చించవలసిన చోట ఖర్చు పెట్టకుండ నిలువ చేసుకునే పిసినారితనం కూడా తృష్ణ క్రిందకే వస్తుంది.

*5. **లోభము** :* ధర్మానికి విరుద్ధంగా ఇతరుల ధనాన్ని లాక్కోవాలనే గుణము.

*6. **మాయ** :* ఇతరులను మాయ చేసి లొంగదీయాలనే భావము.

*7. **దంభము** :* కపటముతో ధర్మాత్ముని వేషం వేసికొని తన గొప్పతనాన్ని ఇతరులు పొగిడేటట్లు చేసుకోవాలనిపించడము. కీర్తి ప్రతిష్టలు సంపాదించి ప్రసిద్ధుడు కావాలనే కోరిక.

ప్రాచీనకాలంలో ఈ రాక్షస, అసురీ ప్రకృతులు క్రూరులు, విలాసపరులు అయిన రాజులలో కనిపించేవి. కానీ ఇప్పుడు కొన్ని మతాలు మొ॥న ధార్మిక సంస్థలలో కూడ ప్రవేశించాయి. కారణమేమిటంటే అక్కడ కూడా రాగద్వేషాలు కనపడవచ్చు.

రాక్షసప్రకృతి మీద ఈ దృష్టాంతం వినండి :-

## బైబిలులో వర్ణించిన దాంభికుడైన మతాధికారి

బైబిలులో రాక్షసప్రకృతికల దాంభికులైన మతాధికారులు ఎలా ధర్మనియమాలను విడిచిపెట్టి

స్వార్థపు వలలో చిక్కుకున్నారో, ఎలా ధనవ్యామోహంలో పడిపోయారో వివరించబడింది.

## జీససు క్రీస్తు యొక్క ఆశ్చర్యకరమైన సామర్థ్యము

జెరూసలేములోని మందిరంలో జీససు ప్రవేశించి వడ్డీవ్యాపారము చేసినవారిని, క్రయవిక్రయాలు చేసేవారిని, పావురాలను అమ్మేవారిని ఉద్దేశించి ఇలా చెప్పాడు –

"దేవ మందిరము ప్రార్థనాస్థలము. దానిని మీరు దొంగలు దాక్కొనే గుహగా మార్చేశారు" అని వర్తకులు కూర్చునే బల్లలను విసిరివేశాడు. పావురాలను అమ్మేవారిని తరిమివేశారు. వారికి బదులుగా కుంటి, గ్రుడ్డి, చెముడు, మూగ మొ॥న అవయవ వైకల్యము కలవారిని మందిరంలో ప్రవేశపెట్టాడు. భగవంతుని ప్రార్థించి వారి రోగాలను నివారించాడు.

యహూదులలో (యూదులలో) పశుబలి ఆచారంగా వుండేది. ప్రజలు వారి వారి సామర్థ్యాన్ని అనుసరించి బలులిస్తుండేవారు. పేదలు పావురాలను బలిచ్చేవారు. మతాచార్యులు పావురాలను అమ్మేవారు.

జీససు క్రీస్తు యొక్క ఈ వింతైన సామర్థ్యమును చూచి మతాచార్యులు కోపోద్రిక్తులయ్యారు. రెండవ రోజున జీససు ధర్మోపదేశం చేస్తూ వుండగా ధర్మోపదేశపు అర్హతలను సూచించే అధికారపత్రం చూపించమని ఆయనను వేధించారు.

జీససు వారితో ఈ వార్త చెప్పాడు –

## దాంభికులైన మతాచార్యులకంటె నియమబద్ధమైన జీవితము గడుపు పేదవాడు గొప్పవాడు

"ఒక రైతుకు ఇద్దరు కుమారులు. అతడు పెద్దకుమారుని పొలానికి వెళ్ళమని ఆజ్ఞాపించాడు. అతడు తాను వెళ్ళనన్నాడు. ఆ తరువాత అతనికి పశ్చాత్తాపం కలిగి తనంతన తానే పనిలోకి వెళ్ళాడు. రైతు రెండవ కుమారుని కూడా అలాగే వెళ్ళమన్నాడు. అతడు "వెళుతున్నాను!" అని సమాధానం చెప్పాడు. కానీ వెళ్ళలేదు. అందులో తండ్రి ఆజ్ఞను పాటించినవాడు ఎవడని మీరంటారు?" వెంటనే మతాచార్యుడు, "పెద్ద కుమారుడు!" అన్నాడు. అప్పుడు జీససు ఇలా అన్నాడు – "న్యాయంగా ధనం సంపాదించుకుని జీవితాన్ని గడుపుతూ వుండే పేదవాడు మీకంటే ముందుగా స్వర్గానికి వెళతాడు.

అప్పుడు మతాచార్యులకు, నాయకులకు కోపము వచ్చింది. వారు జీససును చంపాలనుకున్నారు. ఇలా చేయాలంటే ప్రజలు ఏమనుకుంటారోననే భయం వారికి కలిగింది. జీససు ఆచరణతో ప్రజల హృదయాలను జయించడమే దీనికి కారణం.

## జీససు క్రీస్తు ఉపదేశము

మరొక సందర్భంలో జీససు ఇలా చెప్పాడు –

'బాహ్యమైన ఆడంబరం కోసం మతాచార్యులు ఎన్నో పనులు చేస్తున్నారు. తాము మహాపవిత్రులమని చెప్పుకోడానికి, ధర్మరక్షకులమని ఋజువు చేసుకోడానికి అనేక పన్నాగాలు పన్నుతున్నారు. దేవుడు ఒకడే. మీరందరూ సోదరులు. ప్రజలకు సేవచేసేవాడే గొప్పవాడు. స్వర్గద్వారాన్ని ప్రజలకు మూసివేసినవాడు తుచ్ఛుడు. తాను స్వర్గానికి వెళ్ళలేడు. ఇతరులకు వెళ్ళేందుకు అవకాశం ఉండనివ్వడు. దేవుడి పేరిట కానుకలు తీసుకునే గుడ్డినాయకులు తుచ్ఛులు. వారికి ధనం తప్ప వేరేమీ అక్కరలేదు. ఓ మూర్ఖులారా! ధనం గొప్పదా? ధనానికి పవిత్రతనిచ్చే మందిరం గొప్పదా? న్యాయము, నియమము, దయ, శ్రద్ధ – వీటికి తావు లేకుండా చేసేవారు తుచ్ఛులు. బయటకు తళతళ మెరుస్తూ వున్న పాత్రలు లోపల ఎంత మురికిగా వున్నాయో చూడండి. బయటకు శుభ్రమైన వస్త్రాలను ధరించిన అశాశ్వతమైన శరీరాన్ని, ఎముకల పోగును కల ఆ మానవులు తుచ్ఛమైనవారు. మీరు పైకి అందరి ముందూ ఎంతో నియమపరులుగా నిలబడుతారు. కానీ లోపల దంభము, కపటము నిండి వున్నాయి. ఓ జరూసలేము! నీవు నిజమైన సాధువులను వెళ్ళగొట్టావు. వారి పవిత్ర చరణాలు నీవైపు ప్రసరిస్తూ వుండగా నీవు రాళ్ళవాన వారి మీద కురిపిస్తున్నావు.

**- సశేషం**

# మాతృదేవి స్మృతులు

*శ్రీమతి మంచిరాజు ప్రమీల*

నాగోలు సత్సంగ సభ్యురాలు శ్రీమతి ప్రమీల, పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లితో తన అనుభవాలను, అనుభూతులను ఈ విధంగా తెలియచేస్తున్నారు:

మాది ఒంగోలు. మా నాన్నగారు పూజ్యశ్రీ మాస్టరుగారిని దర్శనం చేసుకున్నారు. ఇంట్లో మిగతా ఎవరమూ వారిని దర్శించుకోలేదు. మా ఇంట్లో శ్రీ సాయి లీలామృతం, శ్రీ గురుచరిత్ర గ్రంథాలు వుండేవి. బాబాపటం కూడా వుండేది. కానీ మా ఇంట్లో విధిగా నిత్యపారాయణ చెయ్యడం వుండేది కాదు. మేము పెద్దవాళ్ళం అయ్యాక నేను యించుమించుగా ప్రతిరోజూ లాయరుపేటలో వున్న బాబాగుడికి వెళ్లేదాన్ని. ఒకసారి నేను బాబాగుడిలో వుండగా, ఒకావిడ వచ్చి "నాకు ఈరోజు ఒంట్లో బాగోలేదు, కొంచెం మాస్టరుగారి సమాధి సేవ చేస్తావా?" అని అడిగారు. అప్పట్లో సమాధి సిమెంటుతో మాత్రమే వుండేది. సేవకి చాలా సమయం పట్టేది. సరేనని ఆరోజు నేనొక్కదాన్నే పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధిసేవ చేశాను. ఇక అప్పటినించి ప్రతిరోజూ పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధికి సేవ చేసుకునేదాన్ని. ఆ పుణ్యమే నాకు పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిని ప్రసాదించిందని అనుకుంటాను.

నేను బాబా గుడిలో వున్న, ఉచిత హోమియో వైద్యాలయంలో case-sheet రాయడం, మందులు కట్టడం చేసేదానిని. ఆదివారం EK గారి హోమియో సెంటరులో సేవచేసేదాన్ని. అదిచూసి నా స్నేహితురాలు ఒకమ్మాయి, "నీకు సేవ అంటే ఇష్టం కదా, పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంట్లో పత్రిక సేవ వుంది వెళతావా?" అని అడిగింది. సరేనని వెళ్లాను. ఆవిధంగా పూజ్యశ్రీ అమ్మగారి దర్శనభాగ్యం కలిగింది. తరువాత నెమ్మదిగా లోపలి సేవకి పూజ్యశ్రీ అమ్మగారి అనుమతి లభించింది. అలా అమ్మగారి సన్నిధిలో, ఆఫీసు పనిలో రోజంతా గడిచి పోయేది. కొన్నాళ్ళకి రాధ కూడా సేవలోకి వచ్చింది. రోజూ మేమిద్దరం ఉదయమే సేవకు వస్తే మళ్ళీ రాత్రే ఇంటికి వెళ్ళేవాళ్ళం. పూజ్యశ్రీ అమ్మగారు నాకు పెళ్లికోసం, ఆరోగ్యం కోసం పారాయణ చెప్పారు.

నాకు పూజ్యశ్రీ అమ్మగారు అనగానే గుర్తు వచ్చేది వారి ప్రేమ, కరుణ. పూజ్యశ్రీ అమ్మగారి సేవలో ఉన్నప్పుడు అమ్మగారు చూపిన ప్రేమను అస్సలు మరిచిపోలేను. అందరూ అమ్మగారు మాకు ప్రాణ భిక్ష పెట్టారు. ఈ ఆపద తొలగించారు అంటారు. కానీ నాకు మాత్రం అమ్మగారు జీవితాన్ని భిక్షగా పెట్టారు. సేవకు వెళ్లకముందు జీవితం వేరు, వెళ్ళిన తరువాత జీవితం వేరు.

పూజ్యశ్రీ అమ్మగారు కన్నతల్లిలా అన్ని విషయాలు నేర్పించేవారు. ఎలా చెయ్యాలో ఎలా చేస్తే బాగుంటుందో అనే విషయాలు అమ్మగారి దగ్గరే నేర్చుకున్నాను. వంట చేసేటప్పుడు కూరగాయలు ఎలా తరగాలో దగ్గరనుంచి, బియ్యం కడగడం, వండి నివేదన చెయ్యడం దాకా చాలా శ్రద్ధగా చేయించేవారు. బాబాకి నైవేద్యము చేస్తున్నాము అనే భావంతో చెయ్యాలని చెప్పేవారు. వారికి నివేదన సమర్పించిన తర్వాత దాన్నే మనం ప్రసాదంగా తీసుకోవాలని, దాని వలన మనకు శారీరకంగా, మానసికంగా కూడా బలమూ మంచి ఆలోచనలు



కలుగుతాయని చెప్పేవారు.

ఏ పనినైనా శ్రద్ధగా బాబాపరంగా చెయ్యాలని చెప్పేవారు. ఏ పని చేసినా బాబాకు, మాస్టరుగారికి చేస్తున్నామని అనుకోవాలి. అటువంటప్పుడు మనలో మంచి భావం కలుగుతుందని చెప్పేవారు.

పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర కూర్చున్నప్పుడు తాము జిల్లెళ్లమూడి అమ్మగారి దగ్గర ఎలా సేవ చేసుకున్నారో చెప్పేవారు. పెద్ద పెద్ద మట్టి తట్టలు మొయ్యటం, పెద్ద పెద్ద వస్తువులను తోమటం చేసేవారట. విరామ సమయంలో కూడా పూజ్యశ్రీ అమ్మగారు విశ్రాంతి తీసుకునే వారు కాదట. చిన్న చిన్న వస్తువులు తోమటం, శుభ్రం చేయటం, సర్దడం వంటి పనుల్లో ఉండేవారట. సేవ అంటే ఎలా చేయాలో చెప్పేవారు. పారాయణ, జపము, ధ్యానము ఎంత ముఖ్యమో, సేవ చేయడం అంతకన్నా ముఖ్యం అని చెప్పేవారు.

ప్రతి విషయాన్నీ చాలా బాగా అర్థమయ్యేటట్లు చెప్పేవారు. ఏదైనా తప్పు చేసినా :అలా కాదు ఇలా చేస్తే బావుంటుంది' అని ఎన్నిసార్లయినా విసుగులేకుండా చెప్పేవారు. ప్రతి గురువారం పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి దగ్గరకు నివేదన చేయించి పంపించేవారు. ప్రతి గురువారం నిలయంలో పూజ్యశ్రీ మాస్టరుగారికి పూలంగి సేవ చేసుకునే వాళ్లం. మధ్యాహ్నం నుంచి మాస్టరుగారికి కిరీటము చేసేవాళ్లం. అమ్మగారు మధ్యాహ్నం అంతా కూర్చుని ఆ కిరీటానికి పూలు అలంకరించడమో డిజైన్ సరిగ్గా వచ్చేటట్టు చూడడమో చేసేవారు. ఒక్కొక్క వారం ఒక్కొక్క డిజైన్ చేసేవారు. ఆ టైం మొత్తం కూర్చునే ఉండేవారు. నెప్పులు కూడా లెక్కచేసేవారుకాదు. అమ్మగారికి పూజ్యశ్రీ మాస్టరుగారి సేవ అంటే అంత శ్రద్ధ! ఎంత పనినైనా వైనంగా ఎలా చేసుకోవాలో చెప్పేవారు. పూలమాలలను ఎన్నిరకాలుగా కట్టవచ్చో దగ్గరుండి చూపించేవాళ్లు. 'ఇన్ని రకాలుగా కట్టవచ్చా' అన్నది అమ్మగారి దగ్గరే చూశాను. ఏ పని ఎప్పుడు చేయాలో, ఏ పని తర్వాత ఏ పని చేస్తే బావుంటుందో బాగా మనస్సుకు హత్తుకునే విధంగా చెప్పేవారు.

నాకు మనసు బాగోలేనప్పుడు దగ్గర కూర్చోబెట్టుకొని మనసుకు ఊరట కలిగించే విధంగా చెప్పేవారు. పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర ఉన్నప్పుడు మనసు చాలా హాయిగా వుండి ఏ విషయాలు గుర్తొచ్చేవి కావు. ఏవైనా బాధలు చెప్పుకుంటే అమ్మగారు అస్సలు మర్చిపోయేవారు కాదు. గుర్తుపెట్టుకొని 'ఎలా ఉంది' అని అడిగేవారు. ఆ బాధ తీరిపోయేది. మన గురించి మన కంటే అమ్మగారికే బాగా తెలుసు. ప్రతిక్షణమూ వెన్నంటి ఉండి కాపాడే పూజ్యశ్రీ అమ్మగారు నిజంగా సర్వజ్ఞులు.

నేను మొట్టమొదట పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరికి చేరేసరికి, ఏ విషయంలోనూ అవగాహన లేదు. కన్నతల్లి కంటే ఎక్కువగా నాకు అన్నీ నేర్పించారు. నేను కూడా ప్రతివిషయం అమ్మగారికి చెప్పుకునేదానిని. నాకు యీ పెళ్ళిసంబంధం వచ్చిన రోజు, యిలా పెళ్ళిసంబంధం వచ్చిందని, మావాళ్ళు యింకా ఆలోచిస్తున్నారని పూజ్యశ్రీ అమ్మగారికి చెప్పాను. వెంటనే అమ్మగారు, మా ఇంటికి ఫోన్ చేసి ఆలోచించక్కరలేదు చెయ్యమని చెప్పారు. అప్పుడు మా వాళ్లకి ధైర్యం వచ్చింది.

2001 మార్చి నెలలో నాకు నిశ్చితార్థం అయ్యింది. అవ్వగానే ఇద్దరం వెళ్లి పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారం చేసుకున్నాము. ఏప్రిల్ లో పూజ్యశ్రీ అమ్మగారు హైదరాబాద్

వెళ్లిపోయారు. మే లో మా వివాహం అయ్యింది. నాకు వివాహమయ్యి జీవితం నాకు ఏర్పడ్డాక ప్రతిక్షణమూ అమ్మగారు గుర్తుకొచ్చేవారు. పూజ్యశ్రీ అమ్మగారు యిచ్చిన శిక్షణ గుర్తుకొచ్చేది.

మావారిది హైదరాబాదు, కానీ ఆఫీసు పని ఒంగోలులో వుండటం వల్ల మేము యిక్కడే వున్నాము. మేము హైదరాబాద్ వస్తూ పోతూ వుండేవాళ్ళం. పూజ్యశ్రీ అమ్మగారు హైదరాబాదులో చిక్కడపల్లిలో వుండేవారు. మేము హైదరాబాదులో వున్నప్పుడు కూడా, దూరం అవటం వల్ల ఎక్కువగా అమ్మగారి దగ్గరకు వెళ్లలేకపోయేదానిని. ఎప్పుడైనా పగటి పూట వెడితే, పూజ్యశ్రీ అమ్మగారు కాస్సేపు మాట్లాడి పంపించేవారు.

తర్వాత కొంత కాలానికి మావారికి బిజినెస్ అవకాశాలు హైదరాబాదులో ఎక్కువగా వుండటం వలన మేము ఒంగోలు నుంచి హైదరాబాదుకి 2007 లో వచ్చేసాము. మావారి బిజినెస్ వ్యవహారాలు మల్కాజిగిరికి బాగా దూరం అయినాసరే అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు అక్కడ వున్నారని మేము మల్కాజిగిరికి వచ్చేసాము. పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకు తరచుగా పిల్లలని తీసుకుని వెడుతుండేదానిని. మాకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. కొన్నాళ్ళకి పూజ్యశ్రీ అమ్మగారు అక్కడి నుండి నాగోలుకి వెళ్లిపోయారు.

శ్రీనివాసుగారి వివాహం నాగోలులో అయ్యింది. నేను మావారిని ఆ పెళ్లికి వెళదామని అడిగాను. మావారు, "మనం వెళ్ళవచ్చో లేదో, పిలిస్తే వెళదాం" అన్నారు. తరువాత కొన్నాళ్ళకి, పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్ళాము. అప్పుడు అమ్మగారు, "శ్రీనివాస్ పెళ్ళికి రాలేదేం?" అని నన్ను అడిగారు. నేనేమి మాట్లాడకుండా మావారి వైపు ఒకసారి చూసి, తలవంచుకుని కూర్చున్నాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు మావారితో, "అది ఈ ఇంటిపిల్ల, మేము పిలిచినా పిలవకపోయినా మీరు అన్ని కార్యక్రమాలకి రావచ్చు" అన్నారు. మావారు అమ్మగారి మాటలకి ఆశ్చర్యపోయారట. ఇక అప్పటినించి ప్రతిఫంక్షనుకి అందరం వెళ్ళేవాళ్ళం. ద్వారకబాబుగారి కళ్యాణంలో మా అబ్బాయిని తోటి పెళ్ళికొడుకుని చేశారు. మా ఆయనకి కూడా గురుకుటుంబంతో అనుబంధం పెరిగింది.

నేను ఒంగోలులో పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర సేవ మొదలు పెట్టినప్పటినుండీ, ఎప్పటికీ వారి సన్నిధిలోనే వుండాలన్న సంకల్పంతో శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయి లీలామృతం, మహాత్ముల ముద్దుబిడ్డడు గ్రంథాలు పారాయణ చేసుకుంటున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు నాగోలుకి వెళ్లిపోయాక, అక్కడికి వెళ్ళడానికి పరిస్థితులు అనుకూలించక మేము మల్కాజిగిరిలోనే వుండిపోయాము. పిల్లల స్కూల్స్,, మా ఇంట్లో పెద్దవాళ్ళ అంగీకారం,,,,ఇవన్నీ ఆటంకంగా వుండేవి. నేను ముఖ్యమైన కార్యక్రమాలకి, పిల్లలని తీసుకుని నాగోలు వెళ్లేదాన్ని. అలా అక్కడికి వస్తూ-పోతూ వుండడంతో సత్సంగ సభ్యులందరితోనూ మాపిల్లలకి పరిచయాలు ఏర్పడ్డాయి. దానితో మనమూ నాగోలు వెళ్ళిపోదామని మొదలుపెట్టారు. చివరికి పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల, మావారు ఒప్పుకుని, మావాళ్ళందరిని ఒప్పించి, శ్రీ ద్వారకబాబుగారి అనుమతితో 2018లో నాగోల్ చేరుకున్నాము. మళ్ళీ మా కుటుంబానికి వారిసన్నిధిలో వుండే భాగ్యాన్ని ప్రసాదించారు.

మావారు బిజినెస్ కారణంగా, ఎక్కువగా బయట డ్యూటీలో వుండేవారు. ఆయన అలా బిజినెస్ పని మీద తిరుగుతున్నప్పుడు చాలాసార్లు ప్రమాదాలనుంచి కాపాడారు. ప్రాణాపాయం నుంచి కూడా తప్పించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో వున్నాయి. ఎంతని చెప్పగలం అమ్మగారి కరుణ గురించి..!!

పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందారని తెలియగానే దుఃఖం, బాధ తట్టుకోలేక "ఏంటమ్మా ఇలా వదిలేసి వెళ్లిపోయారు" అని బాగా ఏడుస్తూ పడుకున్నాను. రాత్రి కలలో అమ్మగారు విపరీతమైన ఇబ్బంది పడుతూ, ఆయాసపడుతూ కన్పించారు. నాకు చాలా బాధగా అనిపించింది. ఎందరు భక్తుల బాధలు స్వీకరించారో అని అనిపించింది.

ఎలా ఉండాలో, ఎలా జీవించాలో, ఎలా సేవ చేసుకోవాలో అన్నీ నేర్పించి జీవితాన్ని ప్రసాదించిన అమ్మగారికి శతసహస్రకోటి కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులు.

బాబా, మాస్టరుగారి, అమ్మగారి మార్గంలో నడిచి వారికి నచ్చినట్లుగా ఉండాలని, ఆ శక్తిని ప్రసాదించమని పూజ్యశ్రీ అమ్మగార్ని ప్రార్థిస్తున్నాను.

జై సాయిమాస్టర్!!

(గత సంచిక తరువాయి)

# ప్రేమ స్వరూపుడు

*శ్రీ కె. ఎస్.ప్రసాద్*

**(అతి చిన్న వయస్సులో మాస్టరుగారి దరిచేరి వారి ప్రేమను పొంది, వారి జీవితంలోని ప్రతి అంశాన్ని కుతూహలంతో క్షుణ్ణంగా పరిశీలించి వారి ఆచరణా పాటవానికి ప్రభావితుడై ఆధ్యాత్మిక బాటలో బాటసారియై తన లక్ష్యము వైపు పురోగమిస్తున్న వీరు ఉత్సాహంగా, విపులంగా మాస్టరుగారి జీవిత ఘట్టాలను మనకందిస్తూ సాయిమాస్టర్ సన్నిధికి తీసుకెళ్తున్నారు.)**

ఒకనాటి రాత్రి మెట్టులో సాయి నామస్మరణతో పడుకున్నాను. మెలకువా కాదు, నిద్రా కాదు. ఒక దృశ్యం గోచరించింది. మాస్టరుగారు సత్సంగం హాలులో ఆసనంపై కూర్చుని వున్నారు. వారి వెనుక బంగారు కాంతులతో వెలిగిపోతున్నట్టి దత్తాత్రేయుడు పైకి నెమ్మదిగా వస్తున్నారు. నేను ఆశ్చర్యపోయాను. ఆచార్యుల వారు చిరునవ్వుతో నన్నే చూస్తున్నారు. నడుము వరకు వచ్చి ఆగిపోయినారు. దత్తాత్రేయ స్వామి చాలా ప్రసన్నంగా వున్నారు. చాలాసేపు ఆ దృశ్యం వున్నది. నేనెంతో ధ్యాన పారవశ్యంలో వుండిపోయాను. ఆ పారవశ్యంలో విద్యానగర్ చేరాను. ఆ రోజు మాస్టరుగారు సత్సంగం హారతిస్తుండే తీరు, బాబాకు కర్పూర హారతి చాలా సేపు త్రిప్పుతూ వుంటే ఆ వెలుగులో వారి ముఖారవిందం దివ్యశోభలతో (నాకు స్వప్నంలో) దేదీప్యమానంగా వెలుగుతోంది. నేను అలానే చూస్తూండిపోయాను. అందరూ నమస్కరించుకొని వెళ్ళారు. నేను, మాస్టరుగారు మాత్రమే మిగిలాం. "ఏమిటి సంగతి?" అన్నారు. "రాత్రి పడుకొని వుంటే మీ వెనుక దత్తస్వామి సగం వరకు వచ్చి ఆగిపోయారు సార్" అన్నాను. చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టుంది వారి చూపు. "ఈ విషయం నీవు ఎవ్వరికీ చెప్పకు" అన్నారు. వారు సమాధి అయ్యేవరకు ఎవ్వరికీ చెప్పలేదు. మొట్టమొదటిసారిగా మండలారాధనప్పుడు పి.వి. రామారావ్ గారికి, శ్రీనివాసుల రెడ్డి గారికి, అయోధ్యగారికి మాత్రమే చెప్పాను. వారి అవతార కార్యంలో మిగిలిన భాగం ఒంగోలులో పూర్తిగా ప్రకటమవటం నాకు తోచింది. ఆ రోజులలో నేను వారికి నమస్కరించేటప్పుడు ఆ దత్తునికి నమస్కారం చేస్తున్నాననే భావంతో చేసేవాడిని.

వారిచ్చిన దివ్యానుభూతులు తలచుకుంటే నాకే సామర్థ్యం లేకున్నా, నేనే సాధనా సరిగా చేయకున్నా , నా బలహీనతలను చూడకుండా వారు నాకు 'ధ్యాన' భిక్ష వేశారంటే వారెంతటి



కరుణామయులో కదా! కలలో కూడా అలాంటి అనుభూతులు పొందేందుకు వీలులేదు. నేనెంతటి అజ్ఞానినో, అహంకారినో నాకు తెలుసు. మాస్టరుగారు చెప్పిన ఏ సాధనైనా అందరికంటే బాగా చేయగలనని నాకు గర్వము ఎప్పుడూ వుండేది. మాస్టరుగారు చెప్పే వివరణలు ఎవ్వరైనా అర్థం కాలేదని మరలా అడిగితే నాకెంతో చిరాకేసి వారి వైపు చులకనగా చూచేవాడిని, నాకేదో పెద్ద అర్థమయినట్లు. అదెంత తప్పో అప్పుడు నాకు తెలిసేది కాదు. అలాంటి వయస్సది.

ఒక రోజు జరుగుమల్లి గ్రామం నుంచి ఒక విద్యావంతుడు మాస్టరుగారితోటి మాట్లాడుతుంటే, వారి సంభాషణ వినాలనిపించి చాలా ఆసక్తితో వింటున్నాను. వారితో మాస్టరుగారు, "మన శాస్త్రాలలోని విషయాలనే ఈనాటి సైన్సు ధృవపరుస్తున్నది. కాని మనవారు మాత్రం మన ధర్మాన్ని మరచి, సైన్సు పేరుతో ఏదో కొత్త విషయాన్ని తెలుసుకుంటున్నామని అనుకుంటూ విదేశీ నాగరికతను వంటపట్టించుకొని యువకులంతా వివరీతంగా ప్రవర్తిస్తున్నారు. నా దగ్గర చాలా ఫారిన్ జర్నల్స్ లోని సైన్సు కొత్త కోణంలో పయనిస్తోందని ఆధ్యాత్మికతను సమర్థిస్తోందని తెలిపేవి చాలా వున్నాయి. ఋషులు తమ జీవితాలను లోక కళ్యాణానికి అంకితం చేశారు. ఇప్పటి కొంతమంది శాస్త్రవేత్తలు నైతిక విలువలకు తిలోదకాలు ఇస్తున్నారు.

ఏ కోణంలో చూచినా హేతు, నాస్తిక సిద్ధాంతాలకు తావేలేదు. మనవారు ధర్మానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు దీని ప్రశ్నే లేదు. వీళ్ళందరూ ధర్మాన్ని అతిక్రమించటం లోకంలో చూస్తాం. 'ఏది కంటికి కనిపిస్తున్నదో దాన్నే మేమంగీకరిస్తాం' అంటారు. మరి మన ఇంద్రియ నిర్మాణాన్ననుసరించి జగత్తు ఈ విధంగా కన్పిస్తుందటారు సైంటిస్టులు. ఇంకోలా ఇంద్రియ నిర్మాణం వుంటే ఇంకోలా కన్పిస్తుంది ఈ జగత్తు. మరి సత్యమేమిటి, అలా కన్పించేటట్టు చేసేదేమిటి అంటే దానికి జవాబులేదు. మా పరిశోధనలో వున్నదాన్ని విశ్లేషించటం వరకే మా పని. ఇంక మాకేమీ సంబంధం లేదు అని తప్పుకుంటారు వాళ్ళు. ఈనాటి యువకులంతా దేవుని నమ్మక పోవటమే ఒక ఫ్యాషన్ అనుకుంటారు. మేం సైన్సును నమ్ముతాం అంటూ సైన్సు ఈ జగత్తు యిలా లేదంటే ఎందుకు నమ్మరు? మరి సత్యాన్నంటి పెట్టుకున్నామన్నారు కదా! ఈ విధంగా మధ్యాహ్నం 2-30 గం॥ల దాకా ఆ వచ్చినాయనకు ఎంతో ఆనందంగా వివరిస్తున్నారు. వారు నమస్కరించుకొని వెళ్ళిన తర్వాత నా వైపు తిరిగి "వారం రోజుల నుంచి వున్న తీట ఇప్పటికి తగ్గిందోయ్' అంటూ వంటగది దగ్గరి వరండాలోకి వచ్చి కూర్చున్నారు.

మాస్టరుగారికి ప్లేట్లో భోజనం వడ్డించాను. "నీవూ పెట్టుకోవోయ్, చాలా లేటయింది." అంటే ఎదురుగా నేను కూర్చుని భోజనం చేసాను. మధ్యమధ్యలో చాలా విషయాలు చెప్పారా రోజు.

ఒకసారి తమాషాగా ఒక కథ చెప్పారు. "ఒకడు దేవుని గూర్చి తపస్సు చేశాడు. కొన్నాళ్ళకు దేవుడు ప్రత్యక్షమై 'ఏం కావాలి' అంటే వాడికేమనాలో తెలియక స్వామీ మీరే ఏమైనా మంచిది చెప్పండి. నేను కోరుకుంటాను అన్నాడు. 'నాయనా! నీవు కోరుకుంటే అది ఇవ్వటం వరకే నా పని" అంటే చాలా సేపు ఆలోచించాడు. ఇంతవరకూ ఎవ్వరూ కోరనిది కోరి చాలా గొప్ప పేరు తెచ్చుకోవాలి అనుకొని ఆలోచించాడు. చివరకు వాడు ఎప్పుడో 'హ్యాంగింగ్' అనే మాట విన్నాడు. వాడు హ్యాంగింగ్ అంటే చాలా గొప్పదిగా వుందని "స్వామీ నాకు 'హ్యాంగింగ్' కావాలని

వుంది అని అన్నాడు. 'నాయనా! మరొక్కసారి ఆలోచించుకో' అని అంటే, 'లేదు స్వామీ నాకు అదే కావాలి' అని అంటే, 'సరే అలాగే పో!' అన్నాడు. కొంత సేపటికి పోలీసులొచ్చి తీవ్రవాది అని వాడ్ని వురితీసారట. అలాగే మనకు మోక్షం, ముక్తి కావాలంటారు. అదంటే ఎలా వుంటుందో తెలియదు. అందరూ ఆ పేరు విని నాకు ముక్తి కావాలి అని కోరుకోవటమే" అన్నారు మాస్టరుగారు. అందరూ చాలా సేపు నవ్వుకున్నారు.

ఒకసారి తలుపూరులో మాస్టరుగారికి మీటింగుంది. నేను ఎలాగైనా వారి మీటింగుకు పోవాలని బస్టాండుకొచ్చాను. బస్సులో ఎక్కేసరికి ఆ బస్సులోనే వున్నారు మాస్టరుగారు. నేను ఆశ్చర్యంతో నమస్కరిస్తే, "ఎక్కడికొస్తున్నావు" అంటే, "తలుపూరు మీటింగుకు సార్" అన్నాను. అప్పుడు వారు, "మీకు అక్కడ చెప్పనిది ఏమైనా చెప్తానేమోనని వస్తున్నావా ఏంటి? మీకు చెప్పాల్సినదంతా చెప్పానురా! కొత్తదంటూ ఏమీ చెప్పేది లేదు" అన్నారు. "ఇంతవరకు మీరు వేదిక మీద ఉపన్యసిస్తుంటే చూడలేదు సార్! మిమ్ములను వేదికమీద చూడాలనే వస్తున్నాను సార్" అన్నాను. "అలాగైతే సరే" అని అన్నారు. తలుపూరు వెంకయ్యస్వామి ఆశ్రమం చేరాం. ఆశ్చర్యం! వెంకయ్యస్వామివారు అక్కడ వున్నారు. మూడు రోజుల నుంచి స్వామి వారు అక్కడున్నారు. యోగనిద్రలోనే వున్నారని చెప్పారు వారి శిష్యులు. మాస్టరుగారు నెమ్మదిగా స్వామి సమీపానికి వెళ్ళి నమస్కరించారు. కొద్దిసేపు ధ్యానంలోకి వెళ్ళిపోయారు. తర్వాత గ్రామంలోకి వెళ్ళాం. స్కూల్ వార్షికోత్సవం. సుబ్బరామయ్యగారు అక్కడే వున్నారు. మీటింగ్ లేటుగా ప్రారంభించారు. మాస్టరుగారు అక్కడ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు విజ్ఞానపరమైన విషయాలు వివరించారు.

ఒకసారి ఉదయం 9గం॥లకు చాలామంది గుంపుగా వస్తున్నారు. ఒకడు పెద్ద బొబ్బలు పెడుతున్నాడు! ఏమైందని నేనడిగితే "వాడికి తేలు కుట్టింది. మాస్టరుగారు మంత్రమేస్తారని తీసుకొస్తున్నాం" అన్నారు. నేను వారి రూంలోకి వెళ్ళాను. అందరూ ఎలా మంత్రానికి బాధ తగ్గుతుందో చూడాలని సత్సంగ హాలు జనంతో నిండిపోయింది. మాస్టరుగారు ఆసనంపై కూర్చుని బాబా వూదీ వాడికి పెట్టి వాణ్ణి తాకకుండా తన చేతిని నెమ్మదిగా క్రిందకు అంటూన్నారు. బాబా యందు సర్వజీవులూ వున్నారన్న స్పురణ వారి ముఖంలో కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. అలా తన చేతిని కదిలిస్తూనే వున్నారు. 5 ని॥లలో వాడికి బాధ తగ్గి నడచివెళ్ళాడు.

కాలేజీ సెలవు రోజుల్లో ఒక గురువారం ఉదయాన్నే 8గం॥లకు మాస్టరుగారి రూంలోకి నిశ్శబ్దంగా వెళ్ళాను. మాస్టరుగారి ధ్యానానికి అంతరాయం కలుగుతుందనే ఉద్దేశ్యంతో అడుగులోఅడుగు వేస్తూ లోపల కూర్చున్నాను. అంతే కళ్ళు నెమ్మదిగా మూతలు పడుతున్నాయి. దీర్ఘమైన ధ్యానంలో వుండగా, అప్పుడు విన్పించింది మృదుమధురమై ఆచార్యుల వాణి ఆ రూమంతా వ్యాపించింది. గురుగీతా శ్లోకాలను ఆలపిస్తున్నారు. ఆ తర్వాత ఉదయ ప్రార్థనానంతరం శ్రీసాయినాథుని షోడశోపచార పూజకు ఉపక్రమించారు! ఒక్కొక్క ఉపచారాన్ని భావయుక్తంగా పలుకుతున్నారు. నాకెంతో ఆనందం కలిగింది.

మధ్యలో బాబా నామావళిని ఒక్కొక్క నామాన్ని ఎన్నోసార్లు చెప్తున్నారు! స్వరాన్ని హెచ్చు తగ్గులుగా చేస్తూ అలా ఆ నామాలన్నింటిని ధ్యాన పారవశ్యంలో చెప్తుతూ, ఉపచారాలన్నీ పూర్తిచేసి నిశ్చల ధ్యాననిష్ఠలో నిలిచిపోయారు. లోకవాసన లేదు. బాహ్యస్మృతి లేదు. శ్రీ సాయినాథుడు, మాస్టరూ ఒక్కరే. ఒకరికొకరు భేదమేలేని అభేద్యస్థితిలో భావంతో మైమరచి 'శిలావిగ్రహంలా' కదిలితే ఒట్టు. లేచి భోజనం చేయాలన్న ఆలోచన లేదు. నామటుకు నేను ఆ ముఖారవిందంలోని లోతుల్ని నిశితంగా పరిశీలనా దృష్టితో చూస్తూనే వున్నా, వెనుక నేను వున్నానన్న స్పృహే లేదు. అక్కడ జగత్తు లేదు! కాలం, దేశం తెలీని లోకమది! నిశ్చలమైన, నిర్మలమైన వానిలా కనిపించారు ఆ చైతన్యమూర్తి! అణువణువు సాయిప్రజ్ఞతో నింపుకున్న ఆ ప్రేమమయ జ్యోతిరూపమే శ్రీ సాయిమాస్టరు. ఎక్కడో దూరాన చెట్టు పై కాకుల ధ్వనులు, పిచ్చుకల కిచకిచలు! తల్లి కొరకెదురుచూస్తున్న లేగదూడలు 'అంబా' అనే అరుపులు! రోడ్డున అప్పుడప్పుడు వచ్చి పోయే లారీలు, బస్సుల హార్న్ మోతలు! బావి గిలక చప్పుళ్ళూ, పసిపిల్లల కేరింతలు లీలగా విన్పిస్తూన్నా, ఆ ధ్యాన పారవశ్యం నుంచి బయటపడవేయలేక మూగబోయాయి. 2గం॥ల



వరకూ ధ్యాన భావనా వినువీధిలో విహరించి ఈ పృథ్వీతలాన్ని పునీతమొనర్చుటకు ఆ పరతత్వం ఆచార్యులలో చల్లని చూపుగా మారి దీనులపాలిట వరమై వారిని బ్రోచుటకు కనులు విచ్చుకున్న చందంగా ముందు కనుబొమ్మలు ముడిపడ్డాయి. మరలా కొద్దిసేపు పరతత్వాన్ని వీడలేక, ధ్యానపారవశ్యంలో లీనమైనారు. మాస్టరుగారు బాబా నామావళి చదువుతూ ఒక్కొక్క పుష్పాన్ని బాబాకు సమర్పించేవారు. పువ్వులన్నీ పెద్దరాశిగా ఆ చిత్రపటంలోని బాబాను ముంచెత్తుతున్న అపూర్వమైన దృశ్యం నా స్మృతిపథంలో మరపురాని మధురస్మృతిగా నిలిచిపోయింది.

శ్రీపూజ్య మాస్టరుగారు నెమ్మదిగా కదిలి 'శ్రీ సాయినాథ్ మహరాజ్ కీ జై!' అన్నారు! నేను గొంతు కలుపుదామంటే మాట పెగలలేదు. మనస్సులోనే వారికి జోహార్లు అర్పించాను. మాస్టరుగారు బాబాకు నమస్కరించి విభూతి పెట్టుకుని ఆసనంపై కూర్చున్నాక, నేను బాబాకు నమస్కరించి, మాస్టరుగారికి శిరస్సు వంచి నా రెండు చేతులలో వారి పాదాలను 'కందిపోతాయేమోనని' సున్నితంగా తాకుతూ నమస్కరిస్తే వారు నా నుదుట విభూతిని పెట్టి నా కళ్ళలోకి కరుణాదృక్కులతో చూశారు. అప్పుడు 2గం॥30ని॥లు అయ్యింది. అనిర్వచనీయమైన అనుభూతిని హృదయంలో నింపుకొని నేను వారివద్ద సెలవు తీసుకొని మరలా ఇంటికి బయలుదేరాను. దారి పొడవునా కన్పించే ప్రకృతంతా కొత్త, వెలుగులతో ప్రకాశిస్తూ కన్పించింది.

విద్యానగర్ సాయిమందిరం ప్రాంగణంలో బావి త్రవ్వకానికని పూండీస్వామి దగ్గరనుంచి తెచ్చిన కొబ్బరికాయ కొట్టి మొదట మాస్టరుగారు గడ్డపార తీసుకొని త్రవ్వడం ప్రారంభించారు. ఆ తర్వాత పార తీసుకొని మట్టిని తీయడం మొదలు పెట్టాము. నేను, దామూ, దేవయ్య, మూర్తి, శ్రీనివాసుల రెడ్డి, రామకృష్ణా రెడ్డి, ప్రకాశరావు, గోవిందప్ప, సుధాకర్ రెడ్డిగారు, ఇంకా చాలామంది ఆ రోజు బావి త్రవ్వకంలో పాల్గొన్నాము. భక్తి భావంతో. మంచి వేసవికాలం! విజృంభించిన సూర్యుని ధాటికి మలామలా మాడి మసై పోతున్నాయి పచ్చిక బయళ్ళన్నీ. ఒంటినిండా చమటలు కక్కుతున్నా బాబా సేవలో వున్నారు సత్సంగ విద్యార్థులు. మాస్టరుగారు ఇంటికి ఒకరిని పంపి పెద్దగిన్నె నిండా చల్లని మజ్జిగ తెప్పించారు. మజ్జిగలో అల్లం, కరివేపాకు, పచ్చిమిర్చి, శొంఠి ఇంకా ఏవేవో వేసి అమ్మగారు తయారుచేసి పంపారు. కడుపార త్రాగినాము.

మాస్టరుగారు అనేక యోగ ముద్రలను వుపయోగించేవారు! శ్వాస చూచి ఎప్పుడూ పని జరుగుతుందో, జరగదో చెప్పేటటువంటి వ్యక్తి మాస్టరు సన్నిధిలో కూర్చొని వున్నప్పుడు ఆ వ్యక్తి "మీ సన్నిధిలో, ఇడా, పింగళా నాడులన్నీ సక్రమంగా పని చేస్తున్నాయి సార్. నేను ఉదయం

నుంచి సమానంగా లేకుండా వుంటే, తంటాలు పడుతున్నా కానీ మీ దగ్గర వాటంతటవే పనిచేస్తున్నాయి" అని అన్నాడు! "సద్గురు సాయి సన్నిధిలో వాటంతటవే మన ప్రయత్నం చేయకనే జరుగుతా" యని మాస్టరుగారు చెప్పారు.

రోటరీక్లబ్ వారు మాస్టరుగారితో మీటింగ్ చెరువు సుబ్రహ్మణ్యశర్మగారింట్లో ఏర్పాటుచేశారు. ఒకసారి అందులో సత్సంగంలో నేటి సామాజిక సమస్యలన్నింటికీ కారణం ధర్మ ప్రచారం లేకపోవటమే. అనేక సామాజిక సంస్థలన్నీ పేదవారి భౌతికమైన అవసరాలు తీర్చినా, వ్యక్తిలో వికాసం, వివేకం లేకుంటే సమకూర్చిన వనరులన్నీ దుర్వినియోగం కావని గ్యారంటీ ఏమిటి? కనుక అందరం ఒక్కసారి ఈ సమస్యను వేరే కోణంలోంచి పరిశీలిద్దాం. ఒక వ్యక్తి రిక్షా లాగుకొంటూ జీవిస్తున్నాడు. వాడు తన సంపాదనతో కుటుంబాన్ని పోషించక మద్యం, సినిమా మొ॥న విలాసాలకు తగలేస్తున్నాడు. ఇంక కుటుంబం జరిగేదెలా? వాళ్ళ పిల్లలు మంచి పౌరులైతే కదా సమాజం సుఖశాంతులతో వుంటుంది! అలాకాకుంటే, వారు నైతికంగా పతనమై సమాజానికి చీడపురుగుల్లా తయారు అవుతారు. కాబట్టి రోగులకు మందులు పంచడం, పిల్లలకు గుడ్డలు పంచి, పుస్తకాలు ఇవ్వటం మంచిదే కాని ఆయా వ్యక్తులు వాటిని వారే సమకూర్చుకొనే పథకాలను మీవంటి వారు ఆలోచించి నెరవేర్చితే చాలు, వారే కావలసినవి నెరవేర్చుకుంటారు. అంతేకాని మా సంస్థ ద్వారా ఇంతమందికి మందులు ఇచ్చాం, ఇన్ని కళ్ళజోళ్ళు ఇచ్చాము, ఇంకా అనేక రకాలైన భౌతికావసరాలను తీర్చామని పేపర్లో ప్రకటించు కోవడానికే తప్ప వ్యక్తిలో మార్పు రాదు. వాడిలో మార్పు వస్తే సమాజం బాగుంటుంది. లేకపోతే అభివృద్ధి అంతా ఫొటోలకే పరిమితమౌతుంది. కాబట్టి వ్యక్తిని సంస్కరించకుండా సమాజాన్ని సంస్కరించలేమన్నారు మాస్టరుగారు.

మాస్టరుగారితో కలిసి చివటం అమ్మను సందర్శించే భాగ్యం కలిగింది. మాస్టరుగారితో పాటు నేను, మరి కొంతమంది కలిసి చివటం వెళ్ళేసరికి అర్ధరాత్రి అయ్యింది మాస్టరుగారొచ్చారని అమ్మ శిష్యులకు తెలిసి చాలామంది రామాలయం వద్దకు చేరారు. అమ్మకుటీరంలోనే వుంటే నిద్ర లేపవద్దని మాస్టరుగారన్నారు. 10 ని॥లలో 'అమ్మ' తలుపు తీసుకొని బయటకొచ్చారు. అందరం నమస్కరించుకొన్నాము. "మీకు శ్రమ కలిగించాము అమ్మా" అంటే, అమ్మ "ఫర్వాలేదు" అన్నారు. అందరకీ అరటిపండ్లను ముందు అమ్మ కొద్దిగా కొరికి తర్వాత ప్రసాదంగా ఇచ్చారు. నేను "అమ్మా! మీరు నన్ను కాపాడాలి" అన్నాను. అమ్మ తల ఆడించారు అలాగేనని. అమ్మకుటీరం ముందు అందరం కూర్చొని వున్నప్పుడు, నేను ధ్యానం చేసుకుంటూ వున్నాను. ధ్యానంలో గొప్ప వెలుగు గోచరించి కొంత దూరం ప్రయాణించింది. వెంటనే నేను కళ్ళు తెరచాను. కుటీరం లోపల నుంచి నా ముందుకు అమ్మ నెమ్మదిగా వచ్చి కొద్ది ప్రక్కగా కూర్చున్నారు. మాస్టరుగారు, మేము అమ్మ వద్ద సెలవు తీసుకొనాలని లేస్తే అమ్మ వుదయాన్నే వెళ్ళు అని చెప్పారు. 10 గం॥లోగా ఒంగోలుకు చేరితే గాని మాతో వచ్చిన కొందరు సకాలంలో ఆఫీసులకు వెళ్ళలేరు కాబట్టి సెలవు తీసుకొని చివటం నుంచి బయలుదేరాం! అమ్మ వాక్కు బ్రహ్మ వాక్కు. 10 మైళ్ళు మా జీపు వెళ్ళిన తరువాత టైర్ పంచరై రోడ్డు మీదే ఉదయం దాకా వున్నది. డ్రైవర్ వెళ్ళి పంచర్ వేసుకొని వచ్చిన తర్వాత వేగంగా ఒంగోలుకు చేరినా మధ్యాహ్నం 2గం॥లు అయ్యింది. ఇంటికెళ్ళినా భోజనాలు వండి తినాలంటే 4గం॥ అవుతుందని, అజంతా హోటల్ లో అందరం కలసి భోజనం చేశాము. నాకై నేనైతే అమ్మను చూడాలంటే ఈ జన్మకు వీలైయ్యేది కాదు. కేవలం మాస్టరుగారి దయ వల్లనే అమ్మ దర్శన, ఆశీస్సులు లభించాయి. అర్ధరాత్రి చివటం అమ్మ దర్శనానికి వెళ్ళి వారి నిద్రాభంగం కలిగించిన నేరానికి అప్పుడు చివటం వెళ్ళిన వారంతా మాస్టరుగారితో విభేదించి వారికి దూరమైనారు. నేను అమ్మను "మీరు నన్ను కాపాడాలమ్మా" అన్నాను. అందుకే కాబోలు కొంతకాలం దూరం చేసినా తిరిగి శ్రీ గురుదేవులైన మాస్టరుగారి చెంతకు చేర్చి వారి ఆశీస్సులిప్పించారు. కొంతకాలం వారికి భౌతికంగా దూరమైనా, సాయి సేవ ద్వారా మానసికంగా ఎప్పుడూ నాలోనే వున్న మాస్టరుగారు శ్రీగురుదేవదత్తునిగా అనుభమయ్యేవారు.

# శ్రీమతి తార్ఖాడ్

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

నేటి సాయి భక్తులకు బాబాచరిత్ర గ్రంథాలలో 'శ్రీమతి మేనేజర్' గా పరిచయమయిన భక్తురాలు శ్రీమతి తారాబాయి సదాశివ తార్ఖాడ్. ఈమె తన మరిది అయిన ఆర్. ఏ. తార్ఖాడ్ ద్వారా మొదటిసారిగా బాబా మహిమ విన్నాక, ఆమెకు కొంత భక్తిశ్రద్ధలు కల్గాయి. ఒకప్పుడు వీరి పాప నళినీ తార్ఖాడ్ కు పదిహేనవ మాసంలో అకస్మాత్తుగా జబ్బు చేసింది. అప్పుడామె, "బాబా నిజంగా నా మరిది చెప్పినంత గొప్పవారే అయితే నాబిడ్డ ఆరోగ్యం చక్కబడాలి. అదే జరిగితే మాకుటుంబమంతా బిడ్డను తీసుకుని బాబా దర్శనానికి శిరిడీ వస్తాము" అని మొక్కుకున్నది. త్వరలో బిడ్డ ఆరోగ్యం బాగయింది. ఆ దంపతులు బిడ్డను తీసుకుని వెళ్ళి బాబాను దర్శించారు. అప్పుడామె చవిచూచిన సాయి సన్నిధి ప్రభావం గురించి యిలా చెప్పింది :

"ఆ రోజులలో శిరిడీ గ్రామంలో వీధి దీపాలే వుండేవి గావు. అక్కడ అప్పట్లో గ్రామ పంచాయితీయే లేదు. దానికి తోడు గ్రామంలో ఎక్కడ పట్టినా పాములు తిరుగుతుండేవి. ఒకరోజు రాత్రి ఆమె కటిక చీకటిలో ఒక వీధి వెంట నడుస్తుండగా ఎందుకో తనకు తెలియకుండానే ఒకచోట నిలిచిపోవాలన్పించి నిలబడిపోయింది. కొద్ది నిముషాలలో ఎవరో అటువైపుగా దీపం తీసుకొచ్చారు. అప్పుడు తెలిసింది – ఆమె ఒక్క అడుగు ముందుకు వేసివుంటే అక్కడ వీధి మధ్యలో పడుకునివున్న పాముపై ఆమె కాలు పడేదే! బాబా తమ సూక్ష్మమైన రీతిన భక్తులను తగురీతిన ప్రేరేపించి ఎలా కాపాడుకుంటారో ఆమెకు అర్థమైంది. ఇలా ఎన్నోసార్లు జరిగింది. ఆయన యిలా ఎన్నిసార్లు రక్షించినా మనం గుర్తించగలమా?

ఈమెకు ఎవరినీ అసహ్యించుకోకుండా అందరిలో భగవంతుని చూడాలని బాబా నేర్పిన విధానం చిత్రమైనది. ఆమె సమక్షంలో ఒకరోజు ఒక కుష్ఠురోగి మశీదులో ప్రవేశించగానే చూచి ఆమె అసహ్యించుకొన్నది. కాని బాబా అతని గుడ్డలమూటలోని పాలకోవా బిళ్ళతీసి ఆమెకు కొంచెం యిచ్చి తినమని ఆదేశించారు; కొంచెం ఆయన నోట్లో వేసుకున్నారు. నాటినుండి ఆరోగ్యం గురించి వైద్యశాస్త్రం చెప్పే జాగ్రత్తలకంటే బాబా అనుగ్రహమే బలీయమైనదని ఆమె గుర్తించింది.

బాబా మరొక రీతిన గూడా ఈమెను అనేకసార్లు కాపాడారు. ఒకప్పుడు శిరిడీలో వుండగా శ్రీమతి తార్ఖాడ్ కళ్ళు బాగా పోట్లు పుట్టి నీరు కారుతున్నాయి. ఈమె ఎప్పటివలె మశీదుకు వెళ్ళి బాబా ఎదుట కూర్చున్నది. ఆయన కొద్దిక్షణాలు ఆమె కళ్ళల్లోకి చూచారు. అప్పటికప్పుడే ఆమె కంటిపోటు తగ్గిపోయి నీరు కారడం ఆగిపోయింది. కాని బాబా కనులవెంట నీరు కారసాగింది. ఆమె బాధను ఆయన తమ పైకి స్వీకరించి ఆమెను కాపాడారు.

ఒకసారి తార్ఖాడ్ దంపతులు శిరిడీ వెడుతూ తమతోగూడ వారిబంట్రోతును తీసుకెళ్ళారు. ఒకరోజుతనికి తీవ్రమైన తొంటినొప్పివచ్చి లేవలేకపోయాడు. అప్పట్లో ఆ గ్రామంలో ఎట్టి వైద్యవసతీ లేదు. అప్పుడు తార్ఖాడ్ వెళ్ళి బాబా ఎదుట నిలబడ్డాడు. అతనిని చూస్తూనే బాబా, "నా కాలంతా నొప్పిగా వున్నది. నొప్పి దుర్భరంగా వున్నది" అన్నారు. అప్పుడొక భక్తుడు, "అది తగ్గేందుకేమైనా చేయరాదా?"అన్నాడు. అప్పుడాయన, "అవును, ఆకుపచ్చని ఆకులు వెచ్చచేసి వాటితో కాపుకాస్తే నొప్పి తగ్గిపోతుంది" అన్నారు. "ఏ చెట్టు ఆకులు?" అని అడిగాడు భక్తుడు. బాబా, "లిండీ కాలువదగ్గర దొరికే

ఆకులు" అన్నారు. "అది కోర్పడ్ (Aloes) ఆకేనా?" అని ఒకరడిగితే, బాబా "అవును, ఆ ఆకుతెచ్చి నిలువుగా చీల్చి నిప్పు సెగచూపి కట్టేస్తే తగ్గిపోతుంది" అన్నారు. ఆయన చెప్పిన మాటలు తమ బంట్రోతు కోసమేనని గుర్తించి తార్కాడ్ ఆ చెట్టు ఆకులు తెచ్చి అతడికి అట్టి చికిత్స చేస్తే అతని బాధ తగ్గిపోయింది.

సం॥1915లో సుమారొకమాసం పైగా శ్రీమతి తార్కాడ్ తీవ్రమైన పార్శ్వపు నొప్పితో బాధపడింది. ఎన్ని మందులు వాడినా తగ్గకపోయేసరికి ఆమె బాధ భరించలేక చనిపోవడమే మేలని తలచింది. కాని యింతలో ఆ చనిపోయే లోపల శిరిడీ కెళ్ళి బాబా పాదాలవద్దనే పోతే, మహా అదృష్టంగదా అనితోచి భర్తతో కలసి కోపర్గాం చేరింది. అక్కడ గోదావరి నది చూడగానే, తాను చనిపోయే ముందు చివరిసారిగా గోదావరి స్నానం చేస్తే ఆ పుణ్యం గూడ వస్తుంది గదా అని తలచి, ఆమె తెగించి ఆ చన్నీటి స్నానం చేసింది. సామాన్యంగా అంత చల్లటి నీటిలో స్నానంచేస్తే తలనొప్పి మరీ ఎక్కువవ్వాలి. అదేమి చిత్రమోగాని ఆమె స్నానం చేసి నదిలోనుంచి బైటకొచ్చేసరికీ ఆ బాధ మచ్చుకైనా లేకుండా పోయింది. అంతేకాదు, అటు తర్వాత ఆమెకా బాధ ఎన్నడూ తిరిగి కలుగలేదు.

బాబా లౌకికంగా ఆమె భర్తను గూడ అనుగ్రహించారు. ఒకసారి అతనిని ఒక మిల్లులో మేనేజర్ పదవినుండి తీసివేసారు. అటు తర్వాత అతడెంతోకాలం నిరుద్యోగిగా వున్నాడు. చివరకు బాబావద్ద ఆశీర్వచనం తీసుకుంటే తనకు ఉద్యోగం లభించవచ్చని తలచి ఆ దంపతులు శిరిడీ చేరారు. కాని చాలా రోజులక్కడ వున్నాగూడా బాబా అతడి వుద్యోగం గురించి ఏమీ ప్రస్తావించకపోగా, "తాత్యాపాటిల్ మొ॥న వాళ్ళు కాలక్షేపానికి అహ్మదునగర్ వెళుతున్నారు. నీవు గూడా వాళ్ళతో వెళ్లి అక్కణ్ణుంచి పూణే వెళ్ళు!" అన్నారు. బాబా తనకు ఉద్యోగం చూపించకుండానే వినోదాలకు పంపుతున్నారని తలచి అతడెంతో చిన్నబుచ్చుకున్నాడు. అయినప్పటికీ బాబా ఆదేశాన్ని పాటించక తప్పదని తలచి అతడు అహ్మద్ నగర్ లో సినిమా చూసి అక్కడనుండి పూణే వెళ్ళాడు. అప్పుడుగాని తనను బాబా అక్కడకెందుకు పంపారో అర్థంగాలేదు. పూణేలో ఒక మిల్లులో పనివారంతా సమ్మె ప్రారంభించారు. పనివారితో వ్యవహరించడంతో ఎంతో సమర్థుడని పేరు పొందిన తార్కాడ్ కోసం ఆ మిల్లు యజమానులు బొంబాయి మొ॥న ప్రాంతాలకు తంతిద్వారా ఆహ్వానాలు పంపారు. సర్వజ్ఞులయిన బాబాకు అది తెలిసే, సమయానికి అక్కడికి పంపడంవలన అతడికి వెంటనే ఆ మిల్లులో మేనేజర్ గా ఉద్యోగమొచ్చింది. బాబా ఆదేశాలు తాత్కాలికంగా ఎంత పరుషంగా అనిపించినా, పర్యవసానాలు చూచాక గాని అమృతం వంటి వారి అంతరంగంలోని సంకల్పం మనకర్థంగాదు.

బాబా గురించి శ్రీమతి తార్కాడ్ కొన్ని ఆసక్తికరమైన వివరాలు చెప్పింది : "తెల్లవారగానే ఆయన ధుని దగ్గర కూర్చొని తమ చేతులు, వ్రేళ్ళు చిత్రవిచిత్రంగా కదిలిస్తూ 'హక్' (పరమాత్మ) అనే పదం ఉచ్చరించేవారు. భక్తులకు బాబా ఆధ్యాత్మిక ఉన్నతి ప్రసాదించే పద్ధతి ఎంతో గుప్తంగా వుండేది. ఎంతో అరుదుగాగాని ఆయన దైవం గురించి మాట్లాడేవారేగాదు. ఆయన అనుసరించిన సాధనా పద్ధతులేమిటో ఎవరికీ అంతుపట్టేవిగావు. కాని ఆయనలోని పవిత్రత, బలము, క్రమబద్ధత, వైరాగ్యము స్పష్టంగా ప్రకటమయ్యేవి. ఆయన జబ్బుగా వున్నప్పుడుకూడా భిక్షకు మాత్రం వెళ్ళేవారు. అలా తెచ్చిన దానిలో ఆయన స్వల్పంగా మాత్రమే భుజించేవారు. మిగిలినదంతా యితరులకు యిచ్చి వేయడమో, లేక వారే తీసుకుపోవడమో జరిగేది.

సామాన్యంగా బాబా చెప్పే మాటలు - 'వర్తకులు' (వణి), 'నూనె వ్యాపారులు' (తేలి) కు సంబంధించేవే వుండేవి. స్థూలదృష్టికి ఆయన మాటలు అర్థం లేని పిచ్చివాగుడుగా తోచేది. కాని ఆయన బుద్ధిపూర్వకంగానే అలా మాట్లాడేవారు. ఆయన ఎవరిని ఉద్దేశించి మాట్లాడతారో వారికి మాత్రమే అర్థమయ్యేవి. సుఖాలపట్ల నిర్లిప్తతే ఆయనలోని ప్రధానలక్షణం. ఆయన తమ నివాసం గురించిగాని సుఖాలపట్లగాని, కించిత్తైనా పట్టించుకొనేవారుకాదు. శిథిలమై మట్టి పెళ్ళలు రాలుతున్న పురాతనమైన ఆ మశీదే వారి నివాసము. సాయి దానిని ఎన్నడూ మరమ్మత్తు చేయించాలనిగూడ తలచేవారుగాదు. ఎవరైనా మరమత్తులు చేయించాలనుకున్నా వారికి ఆటంకాలు కల్గించేవారు. ఆయన రోజు విడిచి రోజు రాత్రి సమయాలలో చావడిలో వున్నప్పుడు మాత్రమే భక్తులు మశీదులో మరమ్మత్తులు చేయగల్గారు. అలా ఒక్క రాత్రిలోగానే మశీదులో నేలంతా బాగుచేసారు.

బాబాకు ఒక ప్రత్యేకమైన సాధనా మార్గమంటూ ఏదీ లేదు. కాని ఎవరికైనా యోగమార్గంలో బాధలెదురైతే ఆయన పరిష్కరించగలిగేవారు. యోగమభ్యసిస్తున్న ఒక సాధకుడికి మొలలవ్యాధి వచ్చి చాలా రక్తం పోతుండేది. అతడు బాబా వద్దకు వచ్చి ఆయన సహాయంతో ఆ వ్యాధి నివారించుకున్నాడు. వారి ఔదార్యం విశేషమైనది. నిత్యమూ వారికివచ్చే దక్షిణలు వందలలో వుండేవి. అదంతా ఆయన పంచేసేవారు. నిరంతరమూ ఆయనవద్దకు వచ్చే భజన బృందాలను, ఫకీర్లను ఆయన ఉదారంగా సత్కరించేవారు. వారి ఆత్మనిగ్రహము మరియు ప్రశాంతతలు గూడా విశేషమైనవే. ఆయనకు మామిడిపండు, రవ్వకేసరి, పెద్ద చిక్కుడుకాయలు యిష్టమని కొందరనుకున్నప్పటికీ నిజానికి భోజన పదార్థాలలో ఆయనకు యిష్టాయిష్టాలే లేవు. ఆయన తమ ఆరోగ్యం గురించి ఏమీ పట్టించుకోరన్నది అందరికీ తెలిసినదే. రోజులో ఎప్పుడైనా ఎవరైనా ఆయనను దర్శించవచ్చు. "నా దర్బారు ఎల్లవేళలా తెరిచేవుంటుంది" అని ఆయనే అనేవారు.

బాబా చర్యలన్నీ ఎట్టి కుటిలత లేక బాహాటంగానే వుండేవి. ఆయన గోప్యంగా ఏమీ చేసేవారు కాదు. సిగ్గుతో ఇతరులనుండి ఆయన కప్పిపుచ్చుకోవాల్సిన అవసరాలు ఏమీలేవు. నిశ్చలమయిన ప్రశాంతత, సంపూర్ణమైన స్వేచ్ఛ ఆయన ప్రత్యేక లక్షణాలు. ఆయన సాధించుకోవలసిన, లేక సంరక్షించుకోవలసిన స్వార్థంగాని లేక సంస్థలుగాని ఏవీలేవు. ఆందోళన పడవలసిన ఆస్తిపాస్తులేవీ ఆయనకు లేవు. నిత్యమూ అంత ధనమొస్తున్నా ఆయన సమాధి చెందిననాడు వారివద్ద ₹16/–లు మాత్రమే మిగిలాయి. సంపూర్ణమయిన న్యాయము, నిష్పక్షపాతము వారి సహజ లక్షణాలు. ధనికులకు అడుగులకు మడుగులొత్తడంగాని, లేక పేదలను తిరస్కరించడంగాని ఆయన ఎన్నడూ చేసేవారుగాదు. ప్రభుత్వ ఆదాయపు శాఖాధికారులు, కలెక్టర్లు, జిల్లా అధికారులు, మమల్తదారులు ఎందరెందరో ఆయన చెంతకు వస్తుండేవారు. అలాగే వీధులవెంట తిరిగే నిరుపేదలు, బిచ్చగాళ్ళుగూడ వస్తుండేవారు. బాబా వారినందరినీ సరిసమానంగా చూచేవారు. నేను చూచిన మహనీయులందరికంటే ఆయనెంతో గొప్పవారు".

ప్రత్యేకంగా సాయిసన్నిధి గురించి ఆమె యిలా చెప్పింది; ""అక్కడకు (వారిసన్నిధికి) వెళ్ళగానే మన కెట్టి ప్రమాదమూ రాజాలదన్న స్థైర్యము అనుభవమయ్యేది. నేను వెళ్ళి వారి చెంతన కూర్చోగానే నా బాధలన్నీ గుర్తులేకుండా పోయేవి. అంతేగాదు, ఈ శరీరము, ప్రాపంచికమైన బాధ్యతలు, చింతలు – వీటిలో ఏవీ గుర్తొచ్చేవి గావు. గంటలు గడుస్తున్నా అచ్చట ఆనంద పారవశ్యంలో వాటి గమనమే తెలిసేదిగాదు. నిజమైన భక్తులెందరో ఆయన వద్ద పొందే అద్వితీయమైన అనుభవం అదే. ఆయనయే మాకు సర్వస్వం. తాము దేహానికి పరిమితులన్న భావం ఆయనలో ఊహకైనా వుండేదిగాదు. ఆయన సమాధి చెందాక, నేను కోల్పోయిన వారి సన్నిధి ఎంత విలువైనదో యిప్పుడు నాకు అర్థమవుతున్నది. ఇక వారి సన్నిధిలో ఆ దేహము, ప్రపంచాలను మరిపించగల ఆనందము యిప్పుడు లభించదుగదా! సాక్షాత్తు మా ప్రాణాలే పోయినట్లయింది. మాకు మా దేహాలు మాత్రమే మిగిలాయి. వారి కన్నులలో ఎంత శక్తి, చురుకుదనమూ వుండేవంటే, వారి కళ్ళకేసి చూస్తుండటము ఎవరికీ సాధ్యంగాదు. అణువణువునా నఖశిఖ పర్యంతమూ ఆయన మన గురించిన వాస్తవాలన్నీ ప్రత్యక్షంగా చదువుతున్నట్లు అనిపించేది. మనం కొద్దిసేపట్లో కళ్ళు దించుకుని వినమ్రుల మవ్వవలసినదే. ఆయన మన హృదయంలోనే గాక, మన దేహంలోని ప్రతి అణువులోనూ వున్నారని తెలిసేది. వారు మాట్లాడిన కొద్దిమాటలతోనో లేక ఒక్క భంగిమతోనో, వారికి మన భూత భవిష్యద్వర్తమానాలేగాక, సర్వమూ తెలుసునని స్పష్టమయ్యేది. సంపూర్ణమైన విశ్వాసంతో వారికి ఆత్మ సమర్పణ చేసుకోవడం తప్ప చేయదగినది వేరేమీ తోచేదిగాదు. అలా చేస్తే ప్రతి చిన్న విషయంలోనూ, క్లిష్ట పరిస్థితిలోనూ మన సంగతంతా ఆయనే చూచుకుంటారు. ఆయన దైవం అనండి, సహజ స్థితిపొందిన సత్పురుషుడనండి, లేక మరేదైనా అనండి – ఆయన అంతర్యామి. మహా శక్తివంతమైన వారి సన్నిధిలో ఎట్టి సందేహాలకు, సంశయాలకు, భయాలకు, ప్రశ్నలకూ తావే వుండేదిగాదు. ఎవరైనా ఆత్మ సమర్పణ చేసుకోవలసిందే. అదే అన్నింటికన్నా భద్రము, ఉత్తమమైన మార్గము, ఏకైక కర్తవ్యమూ అని గుర్తించవలసిందే!"

# ద్వారకామాయి అనుభవమండపము

సాయినాథుడు నా మొరాలకించాడు. నన్ను ప్రొద్దుటూరు నుండి నా స్వంత ఊరికి కాకపోయినా, కడపకు బదిలీ చేశారు. ఇక్కడ శివాలయంలో ప్రతిరోజూ జరిగే సత్కాలక్షేపములో పాల్గొనే అవకాశం లభించింది. రెండవ విషయం స్వప్నం ద్వారా నా బదిలీ గురించి నాకు ముందుగా తెలిసింది. ఆ తెల్లవారి పోస్టుమాన్ బదిలీ ఆర్డర్లు నాకు చేర్చాడు. భగవంతుని ఆజ్ఞపై రచింపబడిన 'శ్రీ సాయి లీలామృతము' గ్రంథ పారాయణ మొదలుపెట్టాను. ప్రారంభించిన మూడవ రోజు రాత్రి భజన, పారాయణ పూజ ముగించుకొని సాయికి నమస్కరణ చేసుకుంటూ రాత్రి పది గంటలకు పడుకున్నాను. వెంటనే యెవరో నల్లని వికృతాకారం గల స్థూలకాయుడు నా వద్దకు వచ్చాడు. నేను భయపడి కండ్లు తెరిచాను. యెవరూ లేరు. మరల పడుకున్నాను. ఈసారి కూడా స్పష్టంగా ఆ వికృతాకారం నాకు కనిపిస్తూంది. అతడు చాలా భయంకరంగా ఉన్నాడు. నేను గట్టిగా కేకపెట్టి ఉలికిపడి లేచాను. చాలా భయమేసింది. సాయినామాన్ని యింకా గట్టిగా అనుకోవడం మొదలు పెట్టాను. అప్పుడు సుమారు 12 గం॥ అయి ఉండవచ్చు. నా తలపై నిమురుతున్నట్లు ఒక చల్లని హస్తస్పర్శ అనుభవమయింది. నా తలవైపునున్న వ్యక్తిని చూచి ఆ భయంకరుడు నా వద్దకు రాలేకపోయాడు. స్వతహాగా అతడు నన్నేమి చేయదలచాడో తెలియదు. కానీ నా దరికి రావడానికి విఫలప్రయత్నం చేస్తూ రాలేకపోయాడు. ఇంతలో నా తల వద్దకు వచ్చిన వ్యక్తిని చూచి అతడు గోడదూకి చాలా భయంగా పారిపోయాడు. నా తల వైపు వ్యక్తి నన్ను జోకొట్టి నిదుర పుచ్చారు. ఎంతో ఆనందంతో హాయిగా నిద్రబోయాను. ఆ ఆనందం వలన నన్ను నిదుర పుచ్చినది సాయినాథుడని మనస్సుకు తెలుస్తున్నది. కాని ఆయన రూపం నాకప్పుడు కనిపించలేదు.

ఇది నాకు వచ్చిన స్వప్నమే. అయినా దానిని స్వప్నమనడం తగదేమో. యదార్థంగా కంటికి కనిపిస్తుంది. ఇతరులకు చెబితే నవ్వుతారని చెప్పలేదు.

-**విమల (కడప)**

---

19వ తేది లక్ష్మివారం : సోదరులు తంగిరాల సుబ్బారావుగారు మాయింటికి వచ్చి బెంగుళూరులోని శ్రీ శివ బాలయోగి, ద్రాక్షారామంలోని ఒక ఆశ్రమంలో ఈ ఒక్కరోజు మాత్రమే దర్శనమిస్తారని చెప్పారు. వెంటనే వెళ్ళి దర్శించాను. నిన్న సాయంత్రం చివటం అమ్మగారి సన్నిధిలో ఈ జరిగినదంతా చెప్పగా, "అవన్నీ ఎందుకు? అక్కడికి యిక్కడికి యెందుకు బాబూ? సాయిబాబాను నమ్ముకున్నారుగా అది చాలు. ఎక్కడికి వెళ్ళకండి" అని అన్నారు. అమ్మ యెంతో ఉత్సాహంగా విద్యానగర్‌లోని సాయి మందిర కార్యక్రమాల గురించి అడిగి, విని ఆనందించారు. అమ్మగారు నిన్న అలా అన్న తరువాత నేను చేసినది తప్పేమో అనిపిస్తున్నది.

***మిగతా 29వ పేజీలో***

# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీ పిన్నోజు వెంకటేశ్వర్లు**

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని నాగోలుకి చెందిన పిన్నోజు వెంకటేశ్వర్లు గారు, ఈవిధంగా తెలియచేస్తున్నారు.

నేను 2010 లో సెంట్రల్ యూనివర్సిటీ లో Ph.D చెయ్యడానికి హైదరాబాద్ వచ్చాను. యూనివర్సిటీలో స్నేహితుడొకడు నాకు 'సాయి లీలామృతం', 'గురుచరిత్ర' గ్రంథాలు యివ్వడం వల్ల పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి తెలిసింది. వారు రచించిన మిగతా గ్రంథాలు కూడా కొన్నాను. ఆ గ్రంథాలు చదువుతుంటే, ఇంత గొప్పగా ఎవ్వరూ రాయలేరు. ఇంత గొప్పగా రాసిన ఆయన ఎవరై వుంటారో ననిపించింది. ఆ మర్నాడు, నాంపల్లి బాబా సేవకులైన శ్రీ అప్పారావు ఒక సంచి నిండా పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు తీసుకువచ్చి, ఒకొక్క గ్రంథం బైటికి తీసి, 'కావాలా?' అని అడుగుతున్నాడు. అలా అడిగినవన్నీ నా దగ్గర వున్నాయి. చివరగా ఒక గ్రంథం తీసి, "ఇది కావాలా" అని అడిగాడు ఆ గ్రంథం పేరు చూడగానే ఒక్కసారి త్రుళ్ళిపడ్డాను! ఆ గ్రంథం పేరు, 'భగవాన్ శ్రీ భరద్వాజ!' బాబా సందేశం సమయానికి గ్రంథాల ద్వారా కూడా వస్తుందన్న లీలామృతంలోని పూజ్యశ్రీ మాస్టరుగారి వాక్యం వెంటనే స్ఫురణకు వచ్చి, ఆ గ్రంథం పేరులోనే నిన్నటి నా ప్రశ్నకి సమాధానం స్ఫురించింది. పూజ్యశ్రీ మాస్టరుగారు సాక్షాత్తు భగవంతుడే అన్న నమ్మకం ఏర్పడింది.

2012లో ఒకరోజు మా ఊరు వెడదామని అనుకుంటున్నాను. అప్పుడు 'ఆచార్యుని అమృతలేఖావళి' గ్రంథం చదువుతున్నాను. అందులో 'ఇంటికి వెళ్లేముందు దర్శనానికి వచ్చిపోరా' అన్న వాక్యం వచ్చింది. అది చదివాక పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను దర్శనానికి నాగోలు రమ్మన్నట్టు బలంగా ప్రేరణ కలిగింది. మా ఊరు వెళ్లే దారిలోనే నాగోలు వస్తుంది. అక్కడ బస్సు దిగి, పూజ్యశ్రీ అమ్మగారు, శివపురిలో వున్నారని తెలిసి, అక్కడికి వెళ్ళాను. అప్పుడు సమయం మధ్యాహ్నం గం.3-30 అయ్యింది. ఆ సమయంలో దర్శనం వుండదు. సాయంత్రం హారతి తర్వాత దర్శనం వుంటుంది. అందుకని బయటినించే నమస్కారం చేసుకుందామని నిలయానికి వెళ్లాను. ఒక్కసారి నేను చూస్తున్నది, కలా, నిజమా అర్థం కాలేదు. ఎందుకంటే, ఎదురుగా సత్సంగ హాలులో పూజ్యశ్రీ అమ్మగారు కూర్చుని వున్నారు!! తలుపు తీసే వున్నది. ఇంకెవ్వరు భక్తులు లేరు. లోపలివాళ్ళు ఒకరిద్దరు వున్నారు, నిజానికి దర్శనం వేళలు, సాయంత్రం హారతి తరవాత.,,,నన్ను రమ్మన్నది పూజ్యశ్రీ మాస్టరు గారు, దర్శనం ఇచ్చినది పూజ్యశ్రీ అమ్మగారు. ఈ అద్భుతమైన అనుభవంతో పూజ్యశ్రీ మాస్టరుగారికి, అమ్మగారికి భేదం లేదని, ఇద్దరూ ఒక్కటేనని నిరూపణ కలిగింది.

నాకు యూనివర్సిటీ లో వినోద్ అనే స్నేహితుడు వున్నాడు. వాళ్ళది తమిళనాడు. శ్రీ రాఘవేంద్రస్వామి భక్తుడు. అతని చేత శ్రీ సాయిలీలామృతం చదివించాలని, నాకు చాలా కోరికగా ఉండేది. ఆ ఉద్దేశంతో తమిళం సాయి లీలామృతం కొన్నాను. కానీ కొన్న తరవాత అతను చదువుతాడో లేదోనని, ఒక వారం పది రోజులవరకు ఇవ్వలేదు. ఒకరోజు, చదివినా చదవక పోయినా అతనిష్టం అనుకుని ఆ గ్రంథం తీసుకెళ్లి,, "వినోద్ ఇది సాయిబాబా జీవిత చరిత్ర, శ్రీ భరద్వాజ గారు రాసింది, చదువుతావా?" అన్నాను. అతను చాలా ఆశ్చర్యానందాలతో ఆ గ్రంథం తీసుకున్నాడు. అతని ప్రతిస్పందన చూసి ఆశ్చర్యపోతున్న నాతో, "నిన్న రాత్రి నాకు ఒక కల వచ్చింది. అందులో ఒకరు నాకు ఈ గ్రంథం చూపించి, "ఇది చదివితే నీ కష్టాలు తీరిపోతాయి" అని చెప్పారు. తెల్లవారాక, ఆ గ్రంథం ఎక్కడ

దొరుకుతుందా.. అనుకుంటున్నాను. నువ్వు తీసుకుని వచ్చావు" అన్నాడు ఎంతో ఆనందంగా. నాకు కాస్సేపు మతి పోయింది, ఎక్కడనించి ఎక్కడికి కలిపి ఈ లీల చేశావయ్యా ,,,అనిపించింది.

2019 లో మా నాన్నగారికి గుండెపోటు వచ్చి, అకస్మాత్తుగా చనిపోయారు. తరవాత కొన్ని రోజులకి, ఒక ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న వాళ్ళ ఇంటికి, వాళ్ళ పిల్లలకి చదువుచెప్పడానికి వెళ్లాను (హోమ్ ట్యూషన్). ఆవిడ మాటల సందర్భంలో, మా నాన్నగారు ఎలా చనిపోయారు? గుండెపోటు వచ్చాక ఏమి చేశారు? ఇవన్నీ అడిగారు. నేను గుండెపోటు వచ్చాక చేసిన ప్రయత్నాలు చెప్తూ 'అంతా 15 నిముషాలలో జరిగిపోయింది' అని చెప్పాను. అప్పుడు ఆవిడ వెంటనే ఆసుపత్రికి తీసుకుని వెడితే బాగుండేదని, లేదా కొన్ని చిట్కాలు చెప్పి, అవి ఉపయోగించినా తప్పక బ్రతికేవారని చెప్పారు. ఇంక అది విన్నప్పటినించి, నాకు చాలా బాధ కలిగింది. అయ్యో, పొరపాటు చేశామా, నాన్నని బ్రతికించుకోలేకపోయామా అని బాధపడుతున్నాను. ఇంతలో, ఆరోజు ఉదయం పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథంలో చదివిన కొన్ని వాక్యాలు గుర్తుకొచ్చాయి. "కొందరు, ఇలా చేసుంటే బ్రతికుండేవారు, అలా చేసుంటే బ్రతికుండేవారు అని అనుకుంటారు. కానీ సమయం వచ్చినప్పుడు ఏం చేసినా ఎవరిని, ఎవరూ కాపాడలేరు". ఈ వాక్యాలు సరిగా నేనున్న మానసిక పరిస్థితికి సరిపోయాయి. వెంటనే నాకు బాధంతా పోయి, మనసు చాలా ప్రశాంతం అయిపోయింది. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు చెప్పుకున్నాను. 'ఇంతగా నావెంటే వుండి, అనుక్షణం కాపాడుతున్నారు కదా!' అనుకున్నాను.

ఎక్కువగా యిలా మనసులో ప్రేరణ కలగడము, సమయానికి గ్రంథాలలో వాక్యాలు గుర్తుకు రావడము ద్వారా పూజ్యశ్రీ మాస్టరు గారు నాకు అనుభవాలను యిస్తారు. ఒకసారి యథాలాపంగా, వంట ఇంట్లో గట్టుమీద కూర్చున్నాను. పక్కనే న్యూస్ పేపర్ ఉంది. దాని మీద పెద్ద అక్షరాలతో, "గురువుకన్నా ఎత్తులో కూర్చోరాదు" అన్న వాక్యం కనిపించింది. నాకు వెంటనే నేనేమైనా మాస్టరుగారి పటం కన్నా ఎత్తులో కూర్చున్నానా? అన్న అనుమానం కలిగింది. తీరా చూస్తే, నేను కూర్చున్న స్టవ్ గట్టు కింద పూజ్యశ్రీ మాస్టరుగారి పటం వుంది. అంటే నేను చాలా ఎత్తులో కూర్చున్నాను. వెంటనే నేను గట్టు మీద నుంచి దిగిపోయాను. ఆ రకంగా నన్ను సరిచేశారు. .

ఇలా ప్రతిక్షణం నా హృదయంలోవుండి నన్ను నడిపిస్తున్న, నాలాంటి కోట్లాదిమంది హృదయాలలో కొలువైవున్న, పూజ్యశ్రీ మాస్టరుగారిని, వారు ఏర్పరచిన బాటలో వారికి నచ్చినట్లు ప్రయాణించి గమ్యం చేరేలా అనుగ్రహించమని ప్రార్థిస్తున్నాను.

జై సాయి మాస్టర్!

## ద్వారకామాయి అనుభవ మండపం

27వ పేజీ తరువాయి

అమ్మగారి సన్నిధికి తరచూ వెళుతున్నాను. అమ్మగారి భక్తులు ఒకరు ఆమె ఆదేశంపై వారి గ్రామంలో ఒక చిన్న కుటీరం నిర్మించుకొని, రోజూ అక్కడ ధ్యానం చేసుకొంటున్నారు. శ్రావణ పౌర్ణమి నాడు ఆ కుటీరంలో నేనూ ధ్యానం చేసుకొన్నాను. మనస్సు అతిసులభంగా ప్రశాంత మయింది. ఈ భక్తునికి ఈ మధ్యలో సాయి కలలో కన్పించారు. తెల్లవారుఝామున వేపచెట్టు క్రింద బండపై ఆశీనులై ఉన్న వారిని చూడగానే అతనికి భావోద్రేకము, ఆనందము కలిగి, సాయి పాదములకు సాష్టాంగ నమస్కారం చేశారుట. బాబా వీరిని లేవనెత్తి, అమ్మ లేదని ఎందుకు బాధపడతావు? నేను లేనా?" అన్నారట. ఇంతలో వీరికి మెళుకువ వచ్చింది. ఈయన తన అనుభవం నాతో చెబుతూ అమ్మగారికి, శ్రీసాయికి ఆధ్యాత్మికంగా సంబంధమున్నట్లు తమకు తోస్తున్నదన్నారు. అమ్మగారు వీరికి కుటీరం ఎలా నిర్మించాలో ప్లాన్ చెప్పి యిద్దరికి సరిపడేటట్లుగా కట్టుకొమ్మని చెప్పారుట. వీరలానే కట్టుకొన్నారు. (ఆగస్టు 8, 1981)

*-శ్రీ ఆర్. గోపాలకృష్ణ, తణుకు*

## పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o.SRI MANGA BHARADWAJA TRUST**

**Regd.Office:** Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68.

Phone: +91 - 74160 41550

**Branch Office** : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh.

Phone:08592 233271

Send DD in favour of **"Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad or Ongole.**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర (Bound) | 450-00 |
| శ్రీ సాయి లీలామృతం | 99-00 |
| శ్రీ గురు చరిత్ర | 99-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రభోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము - భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 25-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్యం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 125-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి - ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాలస్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము - మన సంస్కృతి | 70-00 |

### ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూడ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-1 | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-2 | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |
| బాలల శ్రీ గురు చరిత్ర | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము | 15-00 |
| మాస్టారు అమృత వాక్కులు | 100-00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master (Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's Sai Baba the Master | 60-00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 150-00 |
| Sai Leelamrutham (Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham (Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 50-00 |
| Sri Guru Charitra (Kannada) | 99-00 |
| Shiridi Aarathi (Tamil) | 15-00 |
| Stavana Manjari (Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra (Kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |
| Sai Sannidhi (Kannada) | 120-00 |
| Sri Guru Charitra (Malayalam) | 150-00 |
| Sri Guru Charitra (Oriya) | 150-00 |

# పూజ్య గురుదంపతుల కళ్యాణ మహోత్సవ కార్యక్రమ వివరములు

## మార్చి 5, 2022

**ఉదయం 9 గంటలకు** – పూజ్య గురుదేవులు భరద్వాజ మాస్టరు గారిని వరునిగా చేయుట.
దివ్యజనని అలివేలు మంగమ్మ గారిని వధువుగా చేయుట.
వారి పాదుకలకు పంచామృత అభిషేకము.
శ్రీ సూక్తము, పురుష సూక్తము పారాయణ. వస్త్ర సమర్పణ. మంగళ హారతి, పాటలు.
11:00 గం. – పూజ్య గురుపుత్రిక శ్రీమతి అడిదం వేదవతి గారిచే సత్సంగము.
12:00 గం. – పూజ్య గురుపుత్రులు శ్రీ ద్వారకానాథ్ జ్ఞానేశ్వర్ గారిచే సత్సంగము.
13:00 గం. – నివేదన.
13:30 గం. – భోజన ప్రసాద వితరణ.
14:30 గం. – విరామము.
16:00 గం. – ఎదురుకోలు, వరపూజ.
17:30 గం. – నృత్య ప్రదర్శన.
18:30 గం. – బాపట్ల సత్సంగ సభ్యులచే 'సాయిబాబా' నాటక ప్రదర్శన.
21:00 గం. – శేజ్ ఆరతి.
21:30 గం. – నివేదన, భోజన ప్రసాద వితరణ.

## మార్చి 6, 2022

**ఉదయం 9 గంటలకు** – ఉదయ సేవల అనంతరం అల్పాహార నివేదన, వితరణ.
**10:00 గంటల నుండి:** శ్రీ సాయి సన్నిధిలో, మహాత్ముల సమక్షములో, వేద మంత్రాలతో '**పూజ్య గురుదంపతుల జగత్ కళ్యాణ మహోత్సవ వైభవము**'.
14:00 గం. – నివేదన, ప్రసాద వితరణ (**పెళ్లి భోజనము**).
15:30 గం. – భోజనానంతర విరామము.
16:30 గం. – మహాత్ములను వారి యథాస్థానమునకు భక్తిపూర్వకముగా సాగనంపుట.
18:00 గం. – ధూప్ ఆరతి.
19:00 గం. – కళ్యాణ సంభరాల ముగింపు.

*కళ్యాణ మహోత్సవమునకు విచ్చేయు భక్తులకు వసతి భోజన సదుపాయాలు ఏర్పాటు చేయబడినవి.*
*వివరములకు :- శ్రీ టి.వి. రావు గారు (9063334964).*

కళ్యాణ మహోత్సవ కార్యక్రమము గురించి మరిన్ని వివరములు, latest updates తెలుసుకొనుటకు టెలిగ్రామ్ మెసెంజర్ లో ఏర్పాటు చేయబడిన గ్రూపులో చేరగలరు. గ్రూప్ లింక్, QRcode కింద ఇవ్వబడినవి.

**https://t.me/JagatKalyanam2022**

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust, Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.



మాతృదేవి సన్నిధి (గుమ్మళంపాడు)లో గురు దంపతుల కళ్యాణ మహోత్సవం మార్చి 5-6, 2022న జరుగనున్నది. భక్తులందరూ పరమ శుభప్రదమయిన ఈ కల్యాణ మహోత్సవమును తిలకించి, గురుదంపతుల దివ్యాశీస్సులు పొంది ధన్యులు కావలసినదిగా ప్రార్థన !! కార్యక్రమ వివరములు లోపల ఇవ్వబడినవి.

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET, KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.